పరీక్షా కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమలు : సిపి సాధన రష్మీపెరుమాళ్

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:
జిల్లాలో జరగనున్న టెన్త్, ఇంటర్మీడియట్(తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ) పరీక్షా కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలు చేస్తున్నట్లు సీపీ సాధన రష్మీ పెరుమాళ్ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణ, పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని సిద్దిపేట, చేర్యాల, గజ్వేల్, హుస్నాబాద్ 9 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆయా పట్టణాలలో పరీక్షా కేంద్రాల వద్ద చుట్టూ 500 మీటర్ల పరిధిలో 5 గురు కంటే లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడరాదన్నారు. పరీక్షలు జరిగే రోజుల్లో ఈనెల 20 నుంచి 27 వరకు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పరీక్షలు జరిగే సమయంలో పరీక్షా కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలని ఆదేశించారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా పరీక్షలు రాసేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

రామాయంపేట అభివృద్ధిపై...హరీష్‌రావుతో భేటీ...

బిఆర్ఎస్ జిల్లా నాయకుడు సుప్రభాత్‌రావు, కౌన్సిలర్ చరిత..

రామాయంపేట, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్‌రావును రామాయంపేటకు చెందిన బీఆర్ఎస్ నేత చౌదరి సుప్రభాత్‌రావు, కుమార్తె, కౌన్సిలర్ చౌదరి చరిత శనివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జరిగిన ఈ భేటీలో యువ నాయకుడు పృథ్వీరావు పాల్గొన్నారు. ఈసందర్భంగా రామాయంపేట పట్టణ అభివృద్ధి, మెదక్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించినట్లు సుప్రభాత్ రావు తెలిపారు. పట్టణంలోని తాజా రాజకీయ పరిస్థితులు, వివిధ వార్డుల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై హరీష్‌రావు వివరాలు అడిగి తెలుసుకున్నారని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కౌన్సిలర్లు, పార్టీ నాయకులు చురుకుగా పనిచేయాలని, బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని హరీష్ రావు సూచించినట్లు తెలిపారు. రామాయంపేట మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పటికీ కొనసాగుతుందని ఆయన హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

మంత్రి వివేక్‌వెంకటస్వామికి చిత్రపటాన్ని అందజేస్తున్న బాల్‌రెడ్డి

ప్రభుత్వ పథకాలు పేదలకు అందేలా చూడాలి

మంత్రి వివేక్ వెంకటస్వామి

ములుగు, ఏప్రిల్ 18 (ప్రభాతవార్త): మండల అభివృద్ధికి నిధులు మంజూరుచేయాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి వివేక్‌వెంకటస్వామిని హైదరాబాద్‌లోని వారి కార్యాలయంలో శనివారం సర్పంచ్‌ల ఫోరం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొన్యాల బాల్‌రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ గ్రామాల్లో పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం శ్రీకారం చుట్టి అమలుపరుస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ భరోసా, వెలుగు సమైక్య ద్వారా స్త్రీశక్తి రుణాల అమలు, ఉచిత విద్యుత్ సరఫరా వంటి పథకాలు పేదలకు అందేలా చూడాలని తెలిపారు. ఇదిలా వుండగా ఇటీవల క్షీరసాగర్ గ్రామంలో శ్రీ కోదండరామస్వామి కళ్యాణ మహోత్సవంలో మంత్రి దంపతులు పాల్గొన్న చిత్రపటాన్ని కొన్యాల బాల్‌రెడ్డి మంత్రి వివేక్ వెంకటస్వామికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మక్తాల వెంకటేష్, దర్శన్ తదితరులు ఉన్నారు.

మంత్రి పొన్నంకు ఆహ్వాన పత్రిక అందజేత

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దృశ్యం

జిల్లా కేంద్రంలో ఈనెల 20న నిర్వహించే సామాజిక సంఘ సంస్కర్త విశ్వగురు శ్రీమహాత్మా బసవేశ్వర జయంతి కార్యక్రమానికి రావాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు శనివారం హైదరాబాద్‌లో కలిసి జిల్లా వీరశైవ లింగ బలిజ సమాజం పక్షన ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్, సిద్దిపేట పట్టణ అధ్యక్షులు ఉప్పెన గౌరీశంకర్, సలహాదారులు అనుముల మల్లేశం, కొమురవెల్లి మండల వీరశైవ సమాజం నాయకులు మహాదేవుని రవి, కోరే వీరాంజనేయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన

జోగిపేట సమీకృత కార్యాలయాల భవనానికి శంఖుస్థాపన చేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

జోగిపేట, ఏప్రిల్ 18, ప్రభాతవార్త: వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శనివారం అందోలులో పలు అభివృద్ధిపనులకు శంఖుస్థాపనలు చేయటంతోపాటు ప్రారంభోత్సవాలు చేశారు. అందోలు శివారులో నూతనంగా నిర్మించిన సబ్‌స్టేషన్, జోగిపేట గ్రంథాలయంలో మొదటి అంతస్తులను ప్రారంభోత్సవం చేయగా మిగతా పనులకు శంఖుస్థాపనలు చేశారు. జోగిపేట ఎంపిడిఓ కార్యాలయంలో రూ.20కోట్లతో నిర్మాణం చేయనున్న సమీకృత కార్యాలయాల భవన నిర్మాణానికి, అందోలు చెరువు వద్ద రూ.5కోట్లతో నిర్మిస్తున్న టూరిజం రెస్టారెంట్‌కు శంఖుస్థాపన చేశారు. వీటితోపాటు జోగిపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అడిషనల్ కలెక్టర్ పాండు, అందోలు-జోగిపేట మున్సిపల్ చైర్మన్ ఎస్.క్రిష్టారెడ్డి, వైస్ చైర్మన్ చిట్టిబాబు, కాంగ్రెస్ నాయకులు జగన్మోహన్‌రెడ్డి, ట్రాన్స్‌కో డిఇ శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పొద్దుతిరుగుడు కొనుగోలు నిలిపివేత

ఆందోళనలో రైతులు

బెజ్జంకి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రంలో పొద్దుతిరుగుడు కుప్పలు మార్కెట్ యార్డులో దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ కొనుగోలు కోటా ముగియడంతో రైతులు పండించిన పొద్దు తిరుగుడు పంట అధికారులు కొనుగోళ్లు నిలిపి వేశారు. పండించిన పంట వారాల తరబడి మార్కెట్ యార్డులో ఉన్నాయన వాతావరణ మార్పుల వలన రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పొద్దు తిరుగుడు పంటను కొనుగోలుచేయాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటికే మార్కెట్ యార్డులో అటు మక్కల కొనుగోలు జరుగుతుండడంతో అటు పొద్దు తిరుగుడు, ఇటు మక్కజొన్న రెండు పంటల కొనుగోలు వలన యార్డులో ధాన్యం కుప్పలు పేరుకుపోయాయి. స్థలం లేక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సమీప మైదానంలో ఏర్పాటుచేశారు. వెంటనే పొద్దుతిరుగుడు, మక్కజొన్న పంటను పూర్తిగా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన పొద్దుతిరుగుడు పంట

టాప్ కళాశాలగా శివంపేట పాలిటెక్నిక్

సిఎస్ఆర్ నిధులతో పలు అభివృద్ధి పనులు.. ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా

చౌటకూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:
శివంపేట పాలిటెక్నిక్ కళాశాలను అన్ని పాలిటెక్నిక్ కళాశాలల కంటే ఉన్నత స్థాయికి చేరుకుంటుందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డిజిల్లా చౌటకూరు మండలం శివంపేటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో న్యూలాడ్ పరిశ్రమ సీఆర్ఎస్ నిధులు 43లక్షలతో నిర్మిచిన మెకానికల్ వర్క్‌షెడ్‌ను మంత్రి దామోదర్ రాజనర్సింహ శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి 2.35,75 కోట్ల సిఎస్ఆర్ నిధులు, ఇతర ప్రభుత్వ గ్రాంటులను వెచ్చించామన్నారు. కళాశాలలో డీఎంఎఫ్‌టీ నిధులు 6 లక్షలతో ఏర్పాటుచేసిన హైమాస్ ఎల్ఈడీ లైట్లను, తోషిబా పరిశ్రమ సీఎస్ఆర్ నిధులు 26 లక్షలతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. కళాశాలలో మరో 8కోట్లు వెచ్చిస్తే అవసరమైన మౌలిక సౌకర్యాలు సమకూరతాయని, 5 కోట్లతో బాలికల వసతి గృహం నిర్మించేందుకు అవకాశముంటుందన్నారు. సీఎస్ఆర్ నిధులలో అత్యధిక శాతం శివంపేట పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి వెచ్చించామన్నారు. భవిష్యత్తులో

పాలిటెక్నిక్ కళాశాలలో మెకానిక్ షెడ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

కళాశాల టాప్ కళాశాలగా నిలుస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడా మైదానం, సీసీ రోడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేయిస్తామన్నారు. ఇతర విభాగాల వర్క్ షెడ్‌ల నిర్మాణానికి కృషి చేస్తానని హామి చేశారు. ఈ సందర్భంగా పాలిటెక్నికల్ కళాశాల అభివృద్ధిపై విద్యార్థులతో మంత్రి ముఖాముఖి చేయాల్సిన పనులను తెలుసుకున్నారు. కళాశాలకు బాలికల వసతి గృహం లేకపోవడంతో దూర భారమై చదువు మధ్యలోనే మానేస్తున్నారంటూ పలువురు బాలికలు మంత్రి దృష్టికి తేగా నిధులు మంజూరు చేయించి వసతి గృహాన్ని నిర్మిస్తామని మంత్రి హామి చేశారు. హున్నాపూర్ బస్‌స్టేజి వద్ద ఆర్టీసి బస్సులు నిలుపడం లేదని, ఫలితంగా శివంపేటకు వెళ్లాల్సి వస్తోందని, కళాశాల వరకు ఆర్టీసిబస్సు సౌకర్యం కల్పించాలని మంత్రి దృష్టికి తేగా ఆర్టీసి ఉన్నతాధికారులతో మాట్లాడి అన్ని డిపోలకు చెందిన ఆర్టీసి బస్సులు నిలిపేలా చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు మంత్రి హామి చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య, అదనపు కలెక్టర్ పాండు, సర్పంచ్ కొత్తగడి సంధ్యారాణి మల్లికార్జున్‌గౌడ్, న్యూ ల్యాండ్ ఫౌండేషన్ వైసన ప్రెసిడెంట్ డీవీ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సూర్య నారాయణ, తహసీల్దార్ నామాల కిష్టయ్య, ఎంపిడిఓ శంకర్, మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నత్తి దశరథ్, దుర్గారెడ్డి, డీసీసీబి మాజీ డైరెక్టర్ రామచంద్రారెడ్డి, గణేష్, మల్లారెడ్డి, నాయకులు రాజశేఖర్, గోవర్ధన్, లక్ష్మారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగిన జంగం రేణుకశ్రీనివాస్

మహిళా సర్పంచ్ నిరసన

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట మహిళా సర్పంచ్ జంగం రేణుక శ్రీనివాస్ శనివారం నిరసనకు దిగారు. తనను ఉపసర్పంచ్ రాజుగౌడ్ పదేపదే అవమానిస్తున్నారని ఆమె విమర్శించారు. మహిళగా తనకు తగిన గౌరవం ఇవ్వడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ జంగం రేణుక శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామపంచాయతీకి తెలియకుండా ప్రతి వీధిలో తనకు నచ్చిన వ్యక్తులకు పంచాయతీ నల్ల కలెక్షన్లు ఇస్తున్నారని ఆమె ఆరోపించారు. అదేవిధంగా గ్రామపంచాయతీకి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా దోమల మందు స్ప్రే చేసి సదరు వీడియోలను సోషల్ మీడియాలో పెట్టుకొని అంతా తానే నడిపిస్తున్నట్లు వివరిస్తున్నాడని ఆమె ధ్వజమెత్తారు. మహిళా సర్పంచ్ కావడంతో తనపట్ల చిన్న చూపుచూస్తూ అన్ని మేమే అనే రకంగా వ్యవహరిస్తూ గ్రామపంచాయతీపై అజమాయిషి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసనకు దిగిన జంగం రేణుక శ్రీనివాస్ గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి అక్కడే భోజనాలు చేశారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే ఉప సర్పంచ్ రాజుగౌడ్ పై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

సెల్‌ఫోన్‌కు ఇచ్చిన విలువ ప్రాణాలకు ఇవ్వడంలేదు

మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు

కౌడిపల్లి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:
వాహనదారులు సెల్‌ఫోన్లకు ఇచ్చినంత విలువ ప్రాణాలకు ఇవ్వలేకపోతున్నారని జిల్లా ఎస్పీ బి.వి శ్రీనివాస్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మండల పరిధిలోని రాయిలాపూర్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 99 రోజుల ప్రజాపాలనలో భాగంగా ఆరైవ్-ఆలైవ్ రోడ్డుభద్రత నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించగా ఎస్పీ బివి శ్రీనివాస్‌రావు, తూప్రాన్ డిఎస్పీ నరేందర్‌గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా సర్పంచ్ స్వప్న శేఖులు వాహనదార్లకు ఉచితంగా 50 హెల్మెట్లు అందించగా వాటిని ధరించి వాహనాదార్లు రాయిలాపూర్ గెట్ నుంచి సభా స్థలికి పోలీసులతో కలిసి ర్యాలీగా తరలివచ్చారు. అనంతరం గ్రామ సర్పంచ్ స్వప్నశేఖులు అధ్యక్షతన రోడ్డు ప్రమాద నివారణ అవగాహన సదస్సు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ బి.వి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం సంభవించిన స్థలం వద్ద ఎవరైనాసరే క్షతగ్రాతులను దగ్గరలోగల ఆసుపత్రికి తరలించినట్లైతే వారిని బ్రతికించిన సమయాన్ని గోల్డెన్ అవర్స్ అంటారని ఆయన అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన సంఘటన స్థలంవద్ద ఎవరైనా

ఎస్పీ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న రాయిలాపూర్ గ్రామస్తులు

గోల్డెన్ అవర్స్‌ను ఉయోగించినవారికి ప్రభుత్వం మంచి నజరానా ప్రకటించిందని ఎస్పీ గుర్తు చేశారు. వాహనాదార్లు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని చెప్పారు. 18 సంవత్సరాలలోపు పిల్లలు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని చెప్పారు. ఏదిఏమైనా మెదక్ జిల్లాను రోడ్డు ప్రమాద మరణాలను తగ్గించి జీరో శాతానికి తీసుకురావడమే లక్ష్యం అన్నారు. గ్రామానికి చెందిన యువకులు 765డి జాతీయ రాహదారిపై డివైడర్‌ను ఏర్పాటు చేయించాలని ఎస్పీకి వినతిపత్రాన్ని అందజేశారు. రోడ్డు భద్రత నియమాలు పాటించిన గ్రామానికి చెందిన కొంత మందికి ఎస్పీకి శాలువాలతో సన్మానించి, మెమెంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ సిఐ జాన్‌రెడ్డి, ఎస్సై అమరేందర్‌రెడ్డి, ఎంపిడివో శ్రీనివాస్, తహసీల్దార్ క్రిష్ణయ్య, మెదక్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కుర్మ శేఖులు, గ్రామ ఉప సర్పంచ్ సంత్, గ్రామస్థులు పాల్గొనారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు

జనగణనలో ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించాలి

జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, తహసిల్దార్ శ్రీనివాసాచారి

కొల్చారం, ఏప్రిల్ 18 (ప్రభాతవార్త): జనగణనను విజయవంతం చేయడానికి ప్రజలు ఎన్యుమరేటర్లకు పూర్తి సహకారం అందించాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, తహసీల్దార్ శ్రీనివాసాచారి కోరారు. కొల్చారంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం జనగణన పురస్కరించుకొని ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జనగణన సమయంలో ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్లకు సరైన మరియు సంపూర్ణ సమాచారం అందించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఖచ్చితమైన వివరాలు అందించినప్పుడే ప్రభుత్వానికి సరైన గణాంకాలు లభిస్తాయని, అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఉమారాణి, డిప్యూటీ తహసిల్దార్ నాగవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి దేవాలయం వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు, ఏప్రిల్ 18,ప్రభాతవార్త : పటాన్ చెరు డివిజన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీలోగల అయ్యప్ప స్వామి దేవాలయం 18వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే మహిపాల రెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సపానదేవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, నర్రా బిక్షపతి, సంజీవ రెడ్డి, నరసింహ రెడ్డి, ప్రకాష్ రావు, మాణిక్ ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

కొండాపూర్, ఏప్రిల్ 18 (ప్రభాతవార్త): మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో విద్యుత్ షాక్ తగిలి ఒక వ్యక్తి మృతిచెందినట్లు ఎస్ఐ సోమేశ్వరి తెలిపారు. ఎస్ కథనం ప్రకారం.. గొల్లపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ జమాల్(36), తండ్రి యూసుఫ్ వృత్తిరీత్యా పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం 10 గంటల సమయంలో గ్రామంలోని తెనుగు విట్టల్ ఇంటికి పెయింటింగ్ పనికి వెళ్లాడు. ఈ సందర్భంగా ఇంటి పైకప్పుపై పెయింటింగ్ చేస్తుండగా, చేతిలో ఉన్న పెయింటింగ్ రోలర్ విద్యుత్ వైర్‌ను తాకడంతో షాక్ తగిలింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య అస్గరి బేగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన కిరాణ షాపు వస్తువులు

షార్ట్‌సర్క్యూట్‌తో కిరాణషాపు దగ్ధం

రూ. 10 లక్షల ఆస్తి నష్టం

కౌడిపల్లి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త: ప్రమాదవశాత్తు షాక్‌సర్క్యూట్‌తో కిరాణ దుకాణం దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని వెంకట్‌రావుపేట్ గేట్ వద్ద శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం రాజీపేట గ్రామానికి చెందిన గుండు వీరేశం గుప్తా వెంకట్‌రావుపేట్ గేట్‌వద్ద శ్రీవెంకటేశ్వర కిరాణ దుకాణం పెట్టుకొని జీవనోపాధి పొందుతున్నాడు. శనివారం సాయంత్రం ప్రమాదవ శాత్తు కిరాణ దుకారం దగ్ధం కాగా రూ. 10 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు బోరున విలపించారు. ఈ ప్రమాదంలో నిత్యావసర సరకులైన బియ్యం, పప్పులు, సబ్బులు, నూనెతో పాటు జనరల్ వస్తువులు కాలిపోయాయి. కాగా స్థానికులు సకాలంలో స్పందించి కిరాణ షాపు నుండి కొన్ని డిస్పో గ్లాసులు, పేపర్ ప్లేట్లు తీసినా రూ. 10 లక్షలు ఆస్తినష్టం జరిగింది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చి పెద్ద ప్రమాదం సంభవించకుండా చేశారు. కిరాణ షాపు కాలిపోయి రోడ్డుపాలైన బాధితుని ప్రభుత్వం ఆదుకోని నష్టపరిహారం అందించాలని పలువురు విజ్ఞప్తి చేశారు.

మాదక ద్రవ్యాలు తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

నిషేదిత మాదక ద్రవ్యాలను తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

జహీరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త: గోవా నుంచి హైద్రాబాద్‌కు వెళుతున్న ఓ ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులో నిషేధిత మాదక ద్రవ్యాలను తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ టి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సిఐ శ్రీనివాస్‌రెడ్డి కథనం ప్రకారం... శుక్రవారం సాయంత్రం చిరాగ్‌పల్లి చెక్ పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న తరుణంలో అటుగా వచ్చిన ట్రావెల్స్ బస్సును తనిఖీ చేయగా రాజస్థాన్ జోధాపూర్ జిల్లాకు చెందిన ఋద్ద రామ్ వద్ద న 1.052 కిలో గ్రాములు(డ్రగ్స్), చరాస్, మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. స్వాధీనం చేసుకున్న 1.052 కిలో గ్రాములు(డ్రగ్స్), చరాస్ విలువ 8 లక్షల వరకు ఉంటుందన్నారు. దాడుల్లో ఎక్సైజ్ అధికారులు కోటేశ్వరరావు, బి రమేష్, పి శాంత, జి యాదయ్య, ఎండి యూనస్ తదితరులు ఉన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

చిలిపిచెడ్, ఎప్రిల్ 18 ప్రభాతవార్త : పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసిన ఘటన చిలిపిచెడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై కథనం ప్రకారం... శనివారం సాయంత్రం 545 గంటలకు చిలిపిచెడ్‌లోని చర్చి వెనుక జూదం ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. వెంటనే ఎస్సై నర్సింలు సిబ్బందితో కలిసి దాడిచేసి, జూదం ఆడుతున్న నలుగురిని పట్టుకుని రూ.4,410 నగదు, మూడు మొబైల్ ఫోన్లు, ఒక బైకు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేశారు. ఎస్సై నర్సింలు మాట్లాడుతూ మండలంలోని ఎక్కడైనా జూద కార్యకలాపాలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై నర్సింలు హెచ్చరించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 18 (ప్రభాతవార్త): పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన జగదేవ్‌పూర్ మండలం వట్టిపల్లి గ్రామంలో శనివారం జరిగింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం వట్టిపల్లి గ్రామానికి చెందిన గుగులోతు రాందాస్ కొంత కాలంగా నూకల దందా చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. కొద్దికాలంగా గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు తమను పలు రకాలుగా వేధింపులకు గురిచేస్తుండడంతో తట్టుకోలేక రాందాస్ పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్లు కుటుంబసభ్యులు ఆరోపించారు. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

యువతి అదృశ్యం

వర్గల్, ఏప్రిల్ 18 (ప్రభాతవార్త): మండల పరిధిలోని గౌరారంలో గల ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న కుకునూర్‌పల్లి గ్రామానికి చెందిన పోల్కంపల్లి సత్యనారాయణ కూతురు అక్షిత కనిపించకుండా పోయింది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి కథనం ప్రకారం శనివారం ఉదయం 9 గంటలకు అక్షితను తమ్ముడు పాఠశాల ముందు దించి వెళ్లగా ఆమె పాఠశాలలోకి వెళ్లలేదని, తిరిగి ఇంటికి వెళ్లలేదని తెలిపారు. అక్షిత ఆచూకీ తెలియకపోవడంతో ఆమె తండ్రి సత్యనారాయణ గౌరారం పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భూగర్భ ఆస్తులకు నష్టం కలగకుండా పటిష్ట చర్యలు

మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

మెదక్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : మెదక్ శనివారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో విద్యుత్, నీటిపారుదల, టెలికాం, టిఫైబర్, గ్రామపంచాయతీ, ఆర్ అండ్ బి, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ అటవీ అధికారులతో నుంచి భూగర్భ ఆస్తులకు నష్టం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై వివిధ శాఖలకు అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సిబియాడి ఈయాప్‌ను భారత ప్రభుత్వం డాట్ రూపొందించిందన్నారు. దీని ప్రధాన లక్ష్యం డిగ్గింగ్(తవ్వకం) సమయంలో భూగర్భ లైన్లు దెబ్బ తినకుండా కాపాడటం, తవ్వకం ముందు సమాచారం ఇవ్వడం యాప్‌లో నమోదు చేయవచ్చన్నారు. భూగర్భ సదుపాయాల వివరాలు తెలుసుకోవడం ద్వారా ఆ ప్రాంతంలోఉన్న ఫైబర్‌కేబుల్స్, గ్యాస్, నీటి లైన్లు వంటి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. భూగర్భ ఆస్తులకు(పైప్‌లైన్‌లు, కేబుల్స్, పునాదులు) నష్టం కలగకుండా తవ్వకాలు జరపడం చాలా ముఖ్యమని, దీనికోసం తవ్వకాలకు ముందే భూగర్భ యుటిలిటీ మ్యాపింగ్ జీపీర్ వంటి సాంకేతికతతో) ఉపయోగించి, అధికారులు, సంబంధిత సంస్థల అనుమతులు తీసుకోవాలన్నారు. మానవీయ పద్ధతిలో జాగ్రత్తగా తవ్వడం, నిపుణుల పర్య

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతిమాసింగ్

వేక్షణ, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడం తప్పనిసరిగా వివరించారు. భూగర్భ ఆస్తుల రక్షణకు తీసుకోవాల్సిన ముఖ్యమైన చర్యలపై తవ్వకం చేపట్టే ప్రదేశంలో ఉన్న భూగర్భ కేబుల్స్, పైపు లైన్ల సమాచారాన్ని జీపీర్ ఉపయోగించి ముందుగానే గుర్తించాలన్నారు. అనుమతులపై సంబంధిత ప్రభుత్వ శాఖలు(విద్యుత్, నీటిపారుదల, టెలికాం) నుండి అనుమతులు, మ్యాప్‌లను సేకరించుకోవాలని సూచించారు. యంత్రాలను జేసీబీ వాడే ముందు, భూగర్భ వస్తువులున్నట్లు అనుమానం ఉన్నచోట చేతితో(మనుషులతో) జాగ్రత్తగా తవ్వాలని సూచించారు. నిపుణులైన ఇంజనీర్ల పర్యవేక్షణలో మాత్రమే ఇటువంటి పనులు జరగాలనిచెప్పారు. అప్రమత్తతలోభాగంగా తవ్వకం ప్రదేశంలో హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. తవ్వకాలు జరిపేటప్పుడు చట్టపరమైన నిబంధనలను పాటించడం, ప్రజల భద్రతను (ప్రభుత్వ ఆస్తు లతో సహా) కాపాడడం మన కర్తవ్యం అని వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిపివో యాదయ్య, జిల్లా అటవీఅధికారి జోజీ, ఈడియం సందీప్, టి ఫైబర్ మేనేజర్ ఈశ్వర్, డిఈ అవినాష్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రామ్, మిషన్ భగీరథ అధికారి సంపత్, గ్రిడ్ అధికారి నాగభూషణం, ఈఈపిఆర్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

21న కార్మికుల డిమాండ్ల సాధన కోసం మహాధర్నా

వైద్యాధికారికి మహాధర్నా నోటీస్ అందజేస్తున్న ఎం.నర్సింహ్మా

సైఫాబాద్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త: ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటి కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21న కోటిలోని వైద్యాధికారుల కార్యాలయం ఎదుట 'మహాధర్నా' నిర్వహిస్తున్నామని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా తెలిపారు. ఈ మేరకు శనివారం కింగ్‌కోటిలోని జిల్లా సూపరిటెండెంట్‌కు మహాధర్నా నోటిసును అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం 26 వేలు అమలు చేయాలని, కార్మిక నిబంధనల ప్రకారం ఏడాదికి 23 లీవులు ఇవ్వాలని, ఒక నెల వేతనం బోనస్‌గా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. 21న జరిగే మహాధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

అంధ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

అంధ విద్యార్థులకు ఐపాడ్లు అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు, హెచ్ఎం వెంకటరెడ్డి

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : అంధ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకొని జీవితంలో రాణించాలని దారుల్ షిఫా ప్రభుత్వ అంధుల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మందడి వెంకటరెడ్డి కోరారు. పాఠశాల స్థాపించి 75 ఏళ్లు పూరైన సందర్భంగా వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈఎంఎ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఐపాడ్లును అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో చేరిన అంధ విద్యార్థులు ఉన్నత పాఠశాల వరకు ఉత్తమ ప్రమాణాలతో కూడిన విద్యను నేర్చుకుంటున్నారన్నారు. అన్ని సౌకర్యాలతో వసతి గృహం అందుబాటులో ఉందన్నారు. తల్లిదండ్రులు ప్రభుత్వ అంధుల పాఠశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనుపమ డెవలపర్స్ వారిచే విద్యార్థులకు టైపింగ్ టెస్ట్ నిర్వహించి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఎంఎ ఫౌండేషన్ ప్రతినిధులు మహేష్, ఈశ్వర్, ఉపాధ్యాయులు అమ్జద్ ఖాన్, రవికాంత్, రవీందర్‌రెడ్డి, జానయ్య, మలిహా, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలేయ వ్యాధులపై అవగాహన కల్పించటమే ప్రపంచ కాలేయ దినోత్సవ లక్ష్యం : వైద్యాధికారి మనోజ్‌రెడ్డి

ముషీరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త: కాలేయ వ్యాధులపై అవగాహన కల్పించటమే ప్రపంచ కాలేయ దినోత్సవ ప్రధాన లక్ష్యమని ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. ఏప్రిల్ 19వ తేదీ ప్రపంచ కాలేయ దినోత్సవాన్ని పురస్కరించుకుని, శనివారం కాలేయ వ్యాధులపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ మానవ శరీరంలో అతి ముఖ్యమైన అవయవాల్లో ఒకటైన కాలేయం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని సూచించారు. శరీరంలో విషపదార్థాలను తొలగించటం, రక్తాన్ని ఫిల్టర్ చేయటం, పోషకాలను ప్రాసెస్ చేయటం, జీర్ణక్రియ మెరుగుపరచటంలో సహాయపడటం వంటి అనేక పనులను నిర్వర్తించే కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఆల్కహాల్, ప్రాసెస్ట్ ఫుడ్స్, అధిక కొవ్వు పదార్థాలు, షుగర్స్, ప్యాక్ చేసిన ఆహారాలు, అధిక ఉప్పు వంటివి కాలేయానికి హాని కలిగిస్తాయని, ఆకుకూరలు, కూరగాయలు, నట్స్, ఆలివ్ ఆయిల్, యాపిల్స్, బ్లూబెర్రీస్, బీట్‌రూట్, గ్రీన్‌టీ వంటివి కాలేయానికి మేలు చేసే ఆహారపదార్థాలని వివరించారు. ఎల్లప్పుడూ అలసటగా అనిపించటం, కాళ్లు, చేతులు పసుపు వర్ణంలోకి మారటం, కుడివైపు పొట్టలో నొప్పి, ముదురు రంగులో మూత్రం, వికారం, వాంతులు వంటి లక్షణాలు కాలేయ వ్యాధికి కారణం కావచ్చునని, ఇటువంటి లక్షణాలు కనిపిస్తే అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించి, తగిని పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

తమ సమస్యలను తెలియజేస్తున్న ఇందిరానగర్ బస్తీవాసులు

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త: తమ బస్తీలో నెలకొన్న సమస్యలను పట్టించుకొని పరిష్కరించాలని బంజారాహిల్స్ రోడ్ నంబరు 2లోని ఇందిరానగర్ బస్తీ వాసులు వేడుకుంటున్నారు. సమస్యలపై సమరం కార్యక్రమంలో భాగంగా గత కొద్ది రోజులుగా ఇందిరానగర్ బస్తీ వాసులు గత కొద్ది రోజులుగా తాగునీటి సమస్యలను ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకున్న ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి శనివారం ఆ బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీవాసులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా సరిగా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు బస్తీవాసులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై అధికారులకు, లైన్‌మెన్లకు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. మహిళలు, వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీనికితోడు కాలనీలో రహదారుల పరిస్థితి దారుణంగా ఉందని, మరమ్మత్తులు చేయడం లేదని, వీధిదీపాలు సరిగా పనిచేయడం లేదన్నారు. దీనివల్ల రాత్రివేళల్లో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ప్రజా సమస్యలు అత్యంత ప్రాధాన్యమైనవని, ఆయా సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు శంకర్, బాబు, బాబుగౌడ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇందిరానగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన పరిశీంచారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, పరిశుభ్రత తదితర అంశాలపై ఆయన దృష్టి సారించారు.

మీర్‌పేట్‌లో రాజమండ్రి మహిళ ఆత్మహత్య

సరూర్‌నగర్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త: హైదరాబాద్ మీర్‌పేట్‌లోని ఆర్ఎన్‌రెడ్డినగర్ ద్వారకామాయినగర్ కాలనీలో ఒంటరిగా నివసిస్తున్న ఏపి రాజమండ్రికి చెందిన ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి బైపాస్ రోడ్డు ప్రాంతానికి చెందిన నిండుకుంద అనూరాధ అలియాస్ మంగ (33) గత 2023 నుండి మీర్‌పేట్ ద్వారకామాయినగర్‌లోని కొత్త బుచ్చిరెడ్డి భవనంలో సెకండ్ ఫ్లోర్‌లో సింగిల్ రూంలో అద్దెకు ఉంటున్నది. ప్రైవేటు ఉద్యోగం చేసే అనూరాధ ఇంట్లో నుండి దుర్వాసన రావడాన్ని గమనించిన బుచ్చిరెడ్డి భార్య వరలక్ష్మి కిటికీ నుండి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఉండడం కనిపించింది. ఈ మేరకు బుచ్చిరెడ్డి ఫిర్యాదు చేయగా మీర్‌పేట్ పోలీసులు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ వైఖరికి బిజెపి నిరసన

దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బిజెపి శ్రేణులు

దుండిగల్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ శనివారం గండి మైసమ్మ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్వర చారి మాట్లాడుతూ భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని, అయితే ఈ ప్రజాస్వామ్యంలో సగభాగమైన మహిళలకు చట్టసభల్లో సరైన ప్రాతినిధ్యం ఇప్పటికీ దక్కలేదని పేర్కొన్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు దశకు చేరుకుంటున్న సమయంలో కాంగ్రెస్ పార్టీ అడ్డంకులు సృష్టించడం బాధాకరమని విమర్శించారు. స్వాతంత్రం తర్వాత దశాబ్దాల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీకి మహిళా రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేదని ఆయన ఆరోపించారు. గతంలో యూపీఏ ప్రభుత్వ కాలంలో బిల్లును పూర్తిగా అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్, ఇప్పుడు అదే అంశంపై విమర్శలు చేయడం రాజకీయ ప్రయోజనాల కోసమేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళా సాధికారత దిశగా చర్యలు తీసుకుంటున్న వేళ, కాంగ్రెస్ పార్టీ రాజకీయ లబ్ధి కోసం అవరోధాలు సృష్టిస్తోందని విమర్శించారు. పార్టీ మేనిఫెస్టోల్లో మహిళలకు రిజర్వేషన్ల వాగ్దానం చేసినప్పటికీ, ఆచరణలో అమలు చేయలేదని పేర్కొన్నారు. మహిళలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూసిన కాంగ్రెస్ వైఖరిని ఖండిస్తూ, మహిళలు తమ హక్కుల కోసం చైతన్యంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తుకు హాని కలిగించే రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలు ఏకతాటిపై నిలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ సర్కిల్ అధ్యక్షులు పిసరి కృష్ణారెడ్డి, రాష్ట్ర గిరిజన మోర్చా ఉపాధ్యక్షులు డి శాంరావ్, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు గోనె మల్లారెడ్డి, సర్కిల్ ప్రధాన కార్యదర్శులు భాను ప్రసాద్ గౌడ్, సీతారాంరెడ్డి, ఆకుల లత తదితరులు పాల్గొన్నారు.

మేనేజ్‌మెంట్ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను వెలికితీయడానికి వేదికలు అవసరం

కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి పూర్వ చైర్మన్, డాక్టర్ అంబేద్కర్ విద్యాసంస్థల సీఈఓ ప్రొఫెసర్ లింబాద్రి

చిక్కడపల్లి ఏప్రిల్ 18 (ప్రభాతవార్త) : మేనేజ్‌మెంట్ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, నాయకత్వ లక్షణాలను వెలికితీయడానికి ఇటువంటి వేదికలు దోహదపడతాయని రాష్ట్ర ఉన్నత విద్యామండలి పూర్వ చైర్మన్, డాక్టర్ అంబేద్కర్ విద్యాసంస్థల సీఈఓ ప్రొఫెసర్ లింబాద్రి అన్నారు. శనివారం బాగ్ లింగంపల్లి డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీలో మేనేజ్‌మెంట్ ఫెస్ట్ ఊర్జా 2కె26 ముగిసింది. అభ్యాసం, వినోదం, సాంస్కృతిక సమ్మేళనంతో సాగిన ఈ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రొఫెసర్ డాక్టర్ లింబాద్రి, డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ శర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ బి. అంజన్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఫెస్ట్‌లో భాగంగా నిర్వహించిన ఈవెంట్లలో రెండో రోజు ఏర్పాటు చేసిన బైక్ ఎక్స్‌పో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులతో పాటు ఉస్మానియా విశ్వవిద్యాలయం నగరంలోని వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు తరలివచ్చి ఫెస్ట్‌ను విజయవంతం చేశారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో వైవిధ్యభరితమైన పోటీలు నిర్వహించారు. బిజినెస్ క్విజ్, మేనేజర్ హంట్, బ్రాండ్ మీమ్ వార్, ది బిగ్ యాడ్ థియరీ, షార్క్ ట్యాంక్, మేనేజ్‌మెంట్ గేమ్స్. ఫ్యాషన్ షో, టాలెంట్ హంట్, స్టాండ్‌అప్ కామెడీ, మూవీ టాకీస్, టగ్ ఆఫ్ వార్ వంటివి నిర్వహించారు. ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. అమీర్ లోగ్గు సినిమా ప్రమోషన్, లైవ్ బ్యాండ్ ప్రదర్శనలు విద్యార్థులను ఉర్రూతలూగించాయి. అనంతరం నిర్వహించిన ఫ్లాష్ మాబ్, డీజే సెషన్‌తో ప్రాంగణమంతా కోలాహలంగా మారింది. విద్యార్థుల కేరింతలు, నృత్యాలతో ఊర్జా 2కె26 ఘనంగా ముగిసింది.

కాంగ్రెస్ తీరు మహిళా వ్యతిరేక ధోరణికి పరాకాష్ట : డాక్టర్ వెన్న ఈశ్వరప్ప

చిక్కడపల్లి ఏప్రిల్ 18 (ప్రభాతవార్త) : భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఏప్రిల్ 17 ఒక చీకటి రోజని, మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం ద్వారా కాంగ్రెస్ పార్టీ కోట్లాది మంది మహిళలకు క్షమించరాని ద్రోహం చేసిందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెన్న ఈశ్వరప్ప మండిపడ్డారు. శనివారం బాగ్ లింగంపల్లి లో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లును లోక్‌సభలో కాంగ్రెస్ వ్యతిరేకించడం ఆ పార్టీ మహిళా వ్యతిరేక ధోరణికి పరాకాష్ట అని ధ్వజమెత్తారు. యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా అనే సంప్రదాయం ఉన్న ఈ పుణ్యభూమిలో, మహిళా సాధికారత కోసం ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న చారిత్రక నిర్ణయాన్ని కాంగ్రెస్ కాలరాసిందని ఈశ్వరప్ప విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజన ద్వారా చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచే సువర్ణావకాశాన్ని కేవలం రాజకీయ లబ్ధి కోసమే అడ్డుకున్నారని ఆరోపించారు. బయట మహిళా హక్కుల గురించి మాట్లాడుతూ, పార్లమెంటులో బిల్లును వ్యతిరేకించడం కాంగ్రెస్ ద్వంద్వ నీతికి నిదర్శనమని పేర్కొన్నారు. మహిళలు అధికార పీఠాలను అధిరోహిస్తారనే భయం రాహుల్ గాంధీకి ఇండియా కూటమికి పట్టుకుందని ఆయన ఎద్దేవా చేశారు. మూడు దశాబ్దాలుగా రిజర్వేషన్లను అడ్డుకున్న కాంగ్రెస్, నేడు ఏకంగా బిల్లునే నిలిపివేసే స్థాయికి దిగజారింది. మహిళలను కేవలం ఓటు బ్యాంకులుగా చూడటమే తప్ప, వారిని చట్టసభల ప్రతినిధులుగా చూడటం ఆ పార్టీకి ఇష్టం లేదు" అని విమర్శించారు. భారత మహిళలు ఆదిపరాశక్తి స్వరూపులని, ఈ అన్యాయాన్ని నిశ్శబ్దంగా గమనిస్తున్నారని.. రాబోయే ఎన్నికల్లో బ్యాలెట్ బాక్సుల ద్వారా కాంగ్రెస్ మరియు ఇండి కూటమికి తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

కులగణనలో గంగపుత్ర, బేస్త, గూండ్ల పేర్లను ప్రతిపాదించకపోవటం దారుణం

బీసీ కమీషన్ ఛైర్మన్ నిరంజన్‌కు వినతిపత్రం అందచేస్తున్న తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం నేతలు

ముషీరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త: తెలంగాణలో జరిగిన కులగణనలో గంగపుత్ర, బేస్త గూండ్ల పేర్లను ప్రతిపాదించకపోవటం దారుణమని తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడప శ్రీహరి, నేతలు శివరత్నం, సంగీత, అంబటి సుధాకర్ గంగపుత్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు వారు శనివారం బీసీ కమీషన్ ఛైర్మన్ నిరంజన్‌ను కలసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ కులగణనలో ఏపీలో ఉండే బీసీ ఏ సీరియల్ నెంబర్ 1లో ఉండే ఉపకులం అగ్నికుల క్షత్రియులను పెట్టటం, తెలంగాణలోని గంగపుత్ర, బేస్త, గూండ్ల కులాలను విస్మరించటం, వారి మనోభావాలను దెబ్బతీయటమేనని అన్నారు. తక్షణమే గెజిల్‌లో ఉన్న తమ కులాలను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 33 జిల్లాలలో ఉన్న గంగపుత్ర, బేస్త, గూండ్ల కులాలకు జరిగిన అన్యాయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్కల దృష్టికి తీసుకువెళ్లి, తమ కులాలకు న్యాయం చేయాలని కోరారు. తెలంగాణ కులగణనలో తెలంగాణ గంగపుత్ర, బేస్త, గూండ్ల కులాల పేర్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షం రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. దీనిపై స్పందించిన ఛైర్మన్ నిరంజన్ మీ న్యాయమైన డిమాండ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. అదేవిధంగా తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఫిషరీస్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్‌కు వినతిపత్రం అందచేశామని, దానిపై సాయికుమార్ కూడా సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం నగర అధ్యక్షులు చాట్ల సదానంద్, ప్రధాన కార్యదర్శి పిల్లి శంకర్, అంబటి ధన్‌రాజ్, పూస వేణుగోపాల్, కంటి రాంచందర్, గడప శంకర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండు లక్షల ఉద్యోగాల పేరుతో కాంగ్రెస్ మోసం : ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న దాసోజు శ్రావణ్ తదితరులు

హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త: ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు హామీ ఇచ్చి మోసం చేసిందని నిరుద్యోగల యువకులు, నిరుద్యోగ సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. తెలంగాణ జర్నలిస్టులు ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో " తెలంగాణలో ఉద్యోగాలు నిరుద్యోగ సమస్య" అనే అంశంపై సీనియర్ జర్నలిస్ట్ ఎ. రమణకుమార్, యార నవీన్ కుమార్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ..ఉద్యోగం వ్యక్తిగత అవసరమే కాదు వ్యవస్థ అవసరమని, విధాన నిర్ణయాలు తీసుకునేవాళ్లు ఈ కోణంలో ఆలోచిస్తే సానుకూల దృక్పథంతో నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తారు. ఈ ఆలోచన లేకపోవడంతో తెలంగాణలో నిరుద్యోగం బాగా పెరిగిపోయింది. దీనికి ప్రధాన బాధ్యత ప్రభుత్వాలదే. ప్రభుత్వం అందరికీ ఉద్యోగాలు ఇవ్వలేకపోవచ్చు. కానీ ఉపాధి కల్పించాలి. దురదృష్టవశాత్తు అధికారంలోకి వచ్చే ముందు నిరుద్యోగులకు చాలా హామీలు ఇచ్చింది. ఉద్యోగం రావాలంటే రేవంత్ పోవాలి. నిరుద్యోగానికి ఇదే పరిష్కారం అన్నారు. మొదటి ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేస్తామన్నారు. ఈ రెండున్నర సంవత్సర పాలనలో ఏ డిపార్ట్‌మెంట్‌లో ఎన్ని ఖాళీలు ఉన్నాయో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత 12 ఏళ్ల తర్వాత ఇంకా నిరుద్యోగం గురించి మాట్లాడుకుంటున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు నవీన్,నర్రవిజయ్, ఆసరి రాజు, నిరుద్యోగ జేఏసీ నాయకులు భూక్యా కుమార్, సింధూరెడ్డి, ప్రత్యూష, కొడంగల్ రవి కుమార్ డీవైఎఫ్‌వై నాయకులు వెంకటేష్, పీవైఎల్ నాయకులు బీఎస్ కృష్ణ, బీఆర్ఎస్‌వీ నాయకులు తుంగ బాలు,ఐబీటీ స్కాలర్ రమావత్ మోహన్, ఇజాజ్, హరీశ్,పీడీఎస్‌యూ విద్యార్థి నేత మహేశ్ పాల్గొన్నారు.

అద్భుతంగా సాగిన వీణావాద్య కచేరి

వీణ వాద్య కచేరి నిర్వహిస్తున్న ప్రముఖ వీణా విదుషీమణి డాక్టర్ ఏ.ఎస్. మాధురి కుమార్.

చిక్కడపల్లి ఏప్రిల్ 18 (ప్రభాతవార్త) : ప్రముఖ వీణా విదుషీమణి డాక్టర్ ఏ.ఎస్. మాధురి కుమార్ శనివారం అంబాత్రయ క్షేత్రం నిర్వహణలో గోమాత కళ్యాణమహోత్సవంలో క్షేత్ర వ్యవస్థాపకులు డాక్టర్ ఆదిత్య పరాశ్రీ గురువు సమక్షంలో నిర్వహించిన కచేరి అందరిని సంగీత సాగరంలో తేలియాడించింది. ప్రధానంగా వాతాపి గణపతిం, కంచి కామాక్షివంటి భక్తి సంకీర్తనలు, అమ్మవారి మీద అద్భుతమైన స్వర జతి, అన్నమయ్య కీర్తన తిరు తిరు జవరాల, శక్తివంతమైన అయిగిరి నందిని స్తోత్రం, భక్తి పారవశ్యంలో ముంచెత్తే గోవింద నామాలు, త్యాగరాజ కీర్తనలైన మరుగేలరా ఓ రాఘవ, గంధము పూయరుగా వంటి కీర్తనలను అద్భుతంగా గానం చేసారు. ఈ ప్రదర్శనలకు సంగీత విమర్శకుల నుంచి విశేష ప్రశంసలు లభించాయి. కేవలం దేశీయంగానే కాకుండా, అంతర్జాతీయ వేదికలపై కూడా భారతీయ శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటుతూ ఆమె ముందుకు సాగుతున్నారు.

పద్మారావునగర్ మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం : ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

సికింద్రాబాద్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త: పద్మారావు నగర్ ప్రాంత ప్రజలు 30 సంవత్సరాలకు పైగా ఎదుర్కొంటున్న మురుగునీటి సమస్య నుండి శాశ్వత విముక్తి లభించబోతుందని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం ఆయన (గాంధీ హాస్పిటల్ వెనకాల దారిలో) పద్మారావు నగర్ మెయిన్ రోడ్‌లో శాంభవి అపార్ట్‌మెంట్ వద్ద 72 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన డ్రైనేజీ పైప్ లైన్ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల పురోగతి గురించి అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. పైప్ లైన్ పనులకు అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్స్ అడ్డంకిగా ఉన్నాయని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేసి పనులు సాఫీగా జరిగేలా సహకరించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. తమ సమస్య శాశ్వత పరిష్కారం కోసం కృషి చేసిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వర్షాకాలంలో వరదనీటితో పద్మారావు నగర్ మెయిన్ రోడ్ నిండిపోయి ప్రజలు ఇండ్లలో నుండి బయటకు వెళ్లలేని పరిస్థితి ఉండేదని అన్నారు. అంతేకాకుండా డ్రైనేజీ ఓవర్ ఫ్లోతో రహదారిపై మురుగునీరు ప్రవహించి వాహనదారులు, ప్రజలు నిత్యం ఇబ్బందులు పడేవారని చెప్పారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో 72 లక్షల రూపాయలు మంజూరు చేయించి పనులు చేపట్టినట్లు వివరించారు. పనులు ముమ్మరంగా సాగుతున్నాయని తెలిపారు.

సీవరేజ్ లైన్ పనులకు శంఖుస్థాప...

హమాలీబస్తీ లో 18 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సీవరేజ్ లైన్ పనులకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ శంఖుస్థాపన చేశారు. స్థానిక ప్రజలు పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముందుగా అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్ రెడ్డి, డీజీఎం వెంకట్ రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారి అనిల్, ఎలెక్ట్రికల్ తిదిని మహేష్, హార్టికల్చర్ అధికారి రాజిరెడ్డి, పద్మారావు నగర్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, బన్సీలాల్ పేట డివిజన్ నాయకులు మహేష్, మహేందర్ గౌడ్, లక్ష్మీపతి, అంబులెన్స్ సురేష్, రమణ, శ్రీకాంత్ రెడ్డి, ప్రేమ్, కొత్తూరు వెంకట్, అబ్బాస్, నాగభూషణం, అనిత, నాగలక్ష్మి, హమాలీ బస్తీ వాసులు సుభాష్, సత్యనారాయణ, కుషాల్, అమృత, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం డిపాజిటర్లను మోసగిస్తున్న వ్యక్తి అరెస్టు

సీఐ గోపితో కలిసి వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ సుధాకర్

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : ఏటీఎం డిపాజిటర్ల దృష్టి మరల్చి ఆర్థిక మోసాలకు పాల్పడుతున్న ఒక వ్యక్తిని చాంద్రాయణగుట్ట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి పదివేల రూపాయల నగదు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. శనివారం స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇన్‌స్పెక్టర్ ఆర్.గోపి, డీఐ రామస్వామితో కలిసి ఏసీపీ ఎ.సుధాకర్ వివరాలు వెల్లడించారు. రియాసత్‌నగర్, కంచన్‌బాగ్ నివాసి అబ్దుల్ నాసర్ (36) ఆర్టీఎ ఏజెంట్. ఈనెల 6వ తేదీ రాత్రి 10.15 గంటల ప్రాంతంలో చాంద్రాయణగుట్ట చౌరస్తాలోని యాక్సిస్ బ్యాంక్ ఏటీఎం ద్వారా పదివేల రూపాయలను డిపాజిట్ చేస్తున్నాడు. ఆ సమయంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి తన ఫోన్‌పే ద్వారా డబ్బు బదిలీ చేస్తానని చెప్పి నాసర్ వద్ద నుండి డబ్బును తీసుకున్నాడు. అనంతరం ఒక నకిలీ చెల్లింపు స్క్రీన్‌షాట్‌ను చూపించి అక్కడి నుండి పారిపోయాడు. ఆ తరువాత మోసపోయినట్లు గుర్తించిన అబ్దుల్ నాసర్ ఈనెల 7వ తేదీ ఉదయం 6గంటల ప్రాంతంలో చాంద్రాయణగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు 141/2026 యు/ఎస్ 303(2), 318(4) బిఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా ఈనెల 17వ తేదీ మధ్యాహ్నం 1:15 గంటల ప్రాంతంలో పోలీసులు అదే ఏటీఎం ప్రాంతంలో తలాబ్‌కట్టా అమన్‌నగర్ నివాసి, ప్రైవేటు ఉద్యోగి అబ్దుల్లా ఓబైద్ అల్ కతేరి ఎలియాస్ అబ్దుల్లా (25)ను అదుపులోకి తీసుకున్నారు. అతనిని విచారించగా నకిలీ ఫోన్‌పే అప్లికేషన్ ద్వారా తప్పుడు చెల్లింపుల స్క్రీన్‌షాట్లను చూపి మోసగిస్తున్నట్లు వెల్లడించారు. ఈ విధంగా అనేక నేరాలకు పాల్పడ్డట్లు అంగీకరించాడు. ఏటీఎంలలో డబ్బు డిపాజిట్ చేసే వారిని లక్ష్యంగా చేసుకొని నల్గురి నుండి రూ.46లు మోసం చేశాడు. పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఏసీపీ సుధాకర్ పర్యవేక్షణలో సీఐ గోపి, అదనపు సీఐ రామస్వామి, ఎస్సైలు జె.కిరణ్‌కుమార్, వి.శ్రీనివాసరావు, ఎస్.చంద్రారెడ్డి, సిబ్బంది నిందితుడుని పట్టుకోవటంలో చురుకైన పాత్ర పోషించారు.

రోడ్డుపై అక్రమ నిర్మాణాలు కూల్చివేత

అత్తాపూర్ ఏప్రిల్ 18,ప్రభాతవార్త : రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలపై జీహెచ్ఎంసి అధికారులు ఉక్కుపాదం మోపారు. శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్ నుండి శివరాంపల్లి వరకు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను డిసి సురేందర్ రెడ్డి ఆదేశాలతో టౌన్‌ప్లానింగ్ ఎసిపి శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. ఈ సందర్భంగా టౌన్‌ప్లానింగ్ ఎసిపి శ్రీధర్ మాట్లాడుతూ.. పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ ప్రజల నుండి స్పందన రాకపోవడంతో కూల్చివేతలు చేపట్టినట్లు తెలిపారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించడం వల్ల ప్రజలు, ముఖ్యంగా పాదచారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. అదేవిధంగా ట్రాఫిక్ సమస్యలు కూడా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లఘించి ఎవరైనా ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు చేపడితే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అల్లరి మూకల ఆగడాలపై పోలీసులకు ఫిర్యాదు

పేట్ బషీరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త స్థానిక ప్రాంతంలో పెరుగుతున్న అల్లరి మూకల ఆగడాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు శనివారం పోలీసులను ఆశ్రయించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కుంట సిద్ధిరాములు, ప్రధాన కార్యదర్శి తోకల నగేష్ రెడ్డి, చీఫ్ అడ్వైజర్ ఎర్రి భాస్కర్ రెడ్డి కలిసి పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో సీఐ హౌస్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాత్రివేళల్లో రోడ్లపై మద్యం సేవించి అల్లరి చేసే వ్యక్తులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. బైకులను ధ్వంసం చేసి ఎత్తుకెళ్లడం, కార్ల అద్దాలను పగలగొట్టడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. సెలవుల సందర్భంలో గ్రామాలకు వెళ్లే ఇండ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ఎస్ఆర్ డిజి స్కూల్ గ్రౌండ్ పరిసరాల్లో ప్రతిరోజూ మద్యం ఖాళీ బాటిళ్లు కనిపిస్తున్నాయని, అక్కడ అల్లరి మూకల రాకపోకలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఆ ప్రాంతంలో ప్రత్యేకంగా పెట్రోలింగ్ పెంచి, సిబ్బందికి తగిన ఆదేశాలు జారీ చేయాలని సీఐను కోరారు.

ఎస్సార్ నగర్‌లో పాన్ షాపులపై పోలీసుల తనిఖీలు..



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

సంజీవరెడ్డి నగర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త: ఎస్సార్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు శనివారం పాన్ షాపులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇన్స్‌పెక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐలు రాజు రాథోడ్, సుదీర్ రెడ్డి, సిబ్బంది ఈ తనిఖీలు చేపట్టారు. తనిఖీలలో భాగంగా నిబంధనలు ఉల్లంఘించిన మూడు పాన్ షాపులను గుర్తించిన పోలీసులు, యజమానులపై కేసులు నమోదు చేశారు. కేసులు నమోదైన వారిలో అల్లాపూర్‌కు చెందిన ఇర్ఫాన్ ఆలమ్ (37), బాలానగర్‌కు చెందిన ఆషాల రాజు (42), సనత్ నగర్‌కు చెందిన మహ్మద్ జావేద్ (45)లపై కేసులు నమోదు చేశారు. వారి వద్ద నుండి సంబంధిత వస్తువులను స్వాధీనం చేసుకుని కేసులపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిబంధనలు పాటించని వ్యాపారాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

ఇద్దరు వివాహితల అదృశ్యం...

కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : పెళ్లి శుభకార్యానికి ఇంట్లో నుండి కుటుంబ సభ్యులు వెళ్ళగా ఓ వివాహిత ఇంటి నుండి బయటికి వెళ్లి అదృష్టమైన సంఘటన కెపిహెచ్‌బి కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. హైదర్‌నగర్‌లోని నందమూరి నగర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఖలీల్ మియా కూతురు రజియా భాను బేగం (25) గతంలో పెళ్లికాక గత ఆరు నెలల నుండి తండ్రి వద్దే నివాసం ఉంటుంది. భర్త వద్ద మనస్పర్ధలు కారణంగా తండ్రి వద్ద ఉంటూ స్థానికంగా ఉండే బట్టల దుకాణంలో పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో ఈనెల 16వ తేదీన కుటుంబ సభ్యులు పెళ్లి శుభకార్యానికి ఇంట్లో నుండి బయటకు వెళ్లగా ఇంట్లో నుండి లగేజీ బట్టలు సర్దుకొని భాను బేగం వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు సాయంత్రం తిరిగివచ్చా చూడగా కనిపించకుండా పోవడంతో కెపిహెచ్‌బి కాలనీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మరో సంఘటనలో

పెరుగు తినమన్నందుకు ఇల్లాలి అదృశ్యం...

పెరుగు తినమని భర్త చెప్పడంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఓ ఇల్లాలు ఇంటి నుండి వెళ్ళిపోయిన సంఘటన చోటు చేసుకుంది. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం గోల్కొండకు చెందిన శివకుమార్ భార్య రాజేశ్వరి (20) కలిసి స్థానికంగా నివాసం ఉంటూ కెపిహెచ్‌బి కాలనీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. కాగా రెండు రోజుల క్రితం భార్య రాజేశ్వర్‌కి రోజు పెరుగు తినాలని దీనివల్ల ఆరోగ్యంగా ఉంటావని రాజేశ్వర్‌కి చెప్పాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన రాజేశ్వరి భర్తతో రెండు మూడు రోజుల నుండి మాట్లాడకుండా మౌనంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం ఉదయం పని కోసం శివకుమార్ బయటికి వెళ్ళగా రాజేశ్వరి ఇంట్లో నుండి బయటికి వెళ్లిపోయింది. దీంతో శివకుమార్ కు టుంబ సభ్యులు రాజేశ్వరి ఆచూకీ కోసం వెతికిన ఫలితం లేకపోవడంతో కెపిహెచ్‌బి కాలనీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

విద్యార్థినిని వేధిస్తున్న డెలివరీ బాయ్‌పై కేసు నమోదు

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త: పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థినిని వేధింపులకు గురిచేస్తున్న డెలివరీ బాయ్‌పై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. విద్యార్థిని తల్లి నిర్వహిస్తున్న స్వీట్ కార్న్ స్టాల్‌కు కుంచాల శ్రీనివాస్ (23) అనే యువకుడు తరుచుగా వచ్చి పరిచయం పెంచుకున్నాడు. వారాంతాల్లో తల్లితో కలిసి స్టాల్ వద్దకు వచ్చే బాలికను గమనించిన శ్రీనివాస్, ఆమెతో మాట్లాడేందుకు ప్రయత్నిస్తూ వివరాలు అన్ని తీసుకున్నాడు. తద్వారా విద్యార్థినిని బయటకు రావాలని ఒత్తిడి చేయడం మొదలుపెట్టాడు. ఆమె ఇంటి సమీపంలోనే ఉంటూ, రాత్రివేళల్లో ఫుట్‌పాత్‌పై గడుపుతూ తరచూ వారి ఇంటి వద్ద తిరిగేవాడు. బాలిక చదువుతున్న పాఠశాల వద్దకు వెళ్లడమే కాకుండా, ఇంటి వద్దకు వచ్చి చెప్పులు, లోదుస్తులు దాచడం, అర్ధరాత్రి తలుపులు తట్టడం, రాత్రి వేళల్లో ఫోన్ కాల్స్ చేయడం ద్వారా భయాందోళనలు కలిగించాడు. 2026 మార్చిలో స్నాప్‌చాట్ ద్వారా ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపగా, బాలిక తల్లి హెచ్చరించడంతో ఆ అకౌంట్‌ను తొలగించాడు. ఇటీవల పదో తరగతి పరీక్షల సమయంలో పరీక్షా కేంద్రం వద్దకు వెళ్లి బాలికను ఇబ్బంది పెట్టిన శ్రీనివాస్, ఒకసారి ఆటోలో వెంబడించాడు. ఈ నెల 16న ఇంటి వద్దకు వచ్చిన అతడిని ప్రశ్నించగా, బాలిక తల్లి చేతిని మడతపెట్టి దాడికి యత్నించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ సిలండర్ల అక్రమ దందాపై కేసు నమోదు

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త: బంజారాహిల్స్ ప్రాంతంలో అక్రమంగా కొనసాగిస్తున్న గ్యాస్ సిలిండర్ల విక్రయ గుట్టును పోలీసులు రట్టు చేశారు. అక్రమంగా కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్లు కొనుగోలు, రవాణా చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్సై నవీన్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని శ్రీరామ్‌నగర్ ప్రాంతంలో దాడులు నిర్వహించారు. మహ్మద్ ఫహీమ్ అహ్మద్ (60) అనే వ్యక్తి గ్యాస్ సిలిండర్లను అక్రమంగా తరలిస్తూ, అవసరమైన వారికి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. తనిఖీలలో భాగంగా హెచ్‌పీ గ్యాస్ ఫుల్ సిలిండర్లు 4, భారత్ గ్యాస్ ఖాళీ సిలిండర్లు 4, ఇండేన్ గ్యాస్ ఖాళీ సిలిండర్లు 3, సూపర్ గ్యాస్ ఖాళీ సిలిండర్ 1, గో గ్యాస్ కమర్షియల్ ఖాళీ సిలిండర్ 1, అలాగే 5 కిలోల హెచ్‌పీ ఖాళీ సిలిండర్ ఉన్నాయి. ప్రాథమిక విచారణలో నిందితుడు వివిధ గ్యాస్ ఏజెన్సీల నుంచి డొమెస్టిక్ సిలిండర్లు సేకరించి, వాటిని అక్రమంగా కమర్షియల్ వినియోగానికి మళ్లిస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు అంగీకరించినట్లు అధికారులు తెలిపారు.

దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

తేజస్వి సూర్య తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

చిన్నకోడూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానించేలా బిజెపి ఎంపి తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ అరుకాల శ్రీకాంత్‌యాదవ్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పాటుపై బిజెపి ఎంపి తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ చిన్నకోడూరులో శనివారం ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. బిజెపి నాయకులకు తెలంగాణ అంటే ఎందుకు అంత చిన్న చూపు అని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజు, కర్ణాకర్, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్, విద్యాసాగర్, పోచమల్లు, దేవయ్య,రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపి తేజస్వి సూర్యను బర్తరఫ్ చేయాలి

కాంగ్రెస్ నాయకులు హరికృష్ణ, అత్తు

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్ పాకిస్తాన్‌తో పోల్చడం సరికాదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు ఎండి ఇమామ్(అత్తు) అన్నారు. జిల్లా కేంద్రంలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద తెలంగాణ ఏర్పాటును భారత్-పాకిస్తాన్ విభజనతో పోల్చిన బిజెపి ఎంపి తేజస్వీ సూర్య చేసిన అనుచిత వాఖ్యాలను నిరసిస్తూ ఎండి ఇమామ్(అత్తు) ఆధ్వర్యంలో ఎంపి తేజస్వీ సూర్య దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అవమానించిన ఎంపి తేజస్వీ సూర్యను వెంటనే బర్తరఫ్ చేయాలన్నారు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా తెలంగాణ ప్రజలను అవమానించేలా మాట్లాడిన ఎంపి తీరును ఖండించకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు సాకి అనంద్, బొమ్మల యాదగిరి, లక్ష్మీ, గయాజుద్దీన్, వహాబ్, రషద్, అర్షద్ హుస్సేన్, అజ్మత్, సంతోషి, పద్మారెడ్డి, సనా, రజిని, అంజిరెడ్డి పాల్గొన్నారు.

మహిళా బిల్లుకు కాంగ్రెస్ మద్దతు ఇవ్వకపోవడం సరికాదు

బిజెపి పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్

నిరసన వ్యక్తం చేస్తున్న బిజెపి శ్రేణులు

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : మహిళా బిల్లుకు పార్లమెంటులో కాంగ్రెస్ మద్దతు ఇవ్వకపోవడం సరికాదని బిజెపి పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్ అన్నారు. మహిళా బిల్లుకు కాంగ్రెస్ మద్దతు ఇవ్వనందుకు నిరసనగా శనివారం పార్టీ నాయకులతో కలిసి జిల్లా కేంద్రంలోని పాత బస్టాండు అంబేద్కర్ సర్కిల్ వద్ద పార్లమెంటు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.మహిళా బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసిన కాంగ్రెస్ పార్టీకి మహిళలు బుద్ది చెప్పడం ఖాయమన్నారు. బిల్లును వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీ నాయకులను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు ఉమారెడ్డి, పద్మగౌడ్, సునీల్, సంతోష్, నరేష్, సత్యనారాయణ, సంతోష్, పవన్, యాదగిరి, వెంకట్‌రావు, శ్రీనివాస్, గణేష్, కర్ణాకర్, రమేష్, ఇమామ్‌బాద్ శ్రీనివాస్, ఎల్లం, నగేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

బెజ్జంకి, ఏప్రిల్ 18,ప్రభాతవార్త : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్ముకొని మద్దతు ధరను పొందాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. మండల కేంద్రంతోపాటు వడ్లూరు గ్రామంలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అలాగే అంగన్‌వాడీ టీచర్లుకు స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేసి మాట్లాడారు.వేసవి ఎండలు ముదురుతుండడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేయాలన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

బెజ్జంకిలోని 1వ వార్డులో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ.15 లక్షలతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతతో త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆయన సూచించారు. ఆయా కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులు, అధికారులు,పార్టీ శ్రేణులు ప్రవీణ్, సంతోష్, పులి కృష్ణ, బొల్లం శ్రీధర్ పెద్దన్న, ఒగ్గు దామోదర్, లింగాల శ్రీనివాస్, ముక్కిస రత్నాకర్‌రెడ్డి, ఎపిఎం పర్శరాములు, సీసీలు సారయ్య, తిరుపతి, యాదయ్య, బోనగం రమేష్ ప్రణీత్‌రెడ్డి, సీఎలు, వివో అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యుకెజి గ్రాడ్యుయేషన్ డే

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : జిల్లా కేంద్రంలోని భారత్ నగర్ శ్రీవాణి స్కూల్‌లో శనివారం యూకేజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చిన్నారులు విద్యాభ్యాసంలో తొలి అడుగు పూర్తిచేసిన సందర్భంగా వారికి గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్లు అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ సి.హెచ్.సత్యం మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తుకు పునాది ఈ దశలోనే పడుతుందన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి చిన్నారుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను పరిశీలించిన డిఆర్‌డిఎ పిడి

బెజ్జంకి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : మండల పరిధిలోని గుండారంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను జిల్లా గ్రామీణ అభివృద్ది సంస్థ(డిఆర్‌డిఎ) పిడి జగత్ జయదేవ్ ఆర్య శనివారం పరిశీలించారు. గ్రామ పరిధిలో కొనసాగుతున్న ఫీడర్ ఛానల్ పనులు ఆయన పరిశీలించారు. పనుల నాణ్యత, పురోగతి, కార్మికుల పరిస్థితులపై సమగ్రంగా ఆరా తీశారు. అనంతరం కూలీల సంక్షేమం, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తాగునీరు, టెంట్లను, ప్రథమ కిట్లను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్, ఎంపిడివో ప్రవీణ్, ఎపివో, సీసీలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పిడి జయదేవ్ ఆర్య

ఆసుపత్రిలో మెరుగైన సేవలు అందించాలి

గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన కాయకల్ప వైద్యాధికారులు

గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 18 (ప్రభాతవార్త): గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో కాయకల్ప కార్యక్రమం అమలును కాయకల్ప వైద్యాధికారులు, నిజామాబాద్ డిసిఎస్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్ శనివారం పరిశీలించారు. గజ్వేల్ ప్రభుత్వాసుపత్రి తో పాటు మాతా శిశు సంరక్షణ కేంద్రంలో విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రి ప్రాంగణం, ఓపి విభాగం, ఇన్‌పేషెంట్ వార్డులు, ప్రసూతి విభాగం, అత్యవసర విభాగం, ల్యాబ్, ఫార్మసీ, శౌచాలయాలు, వంటశాల, తాగునీటి సదుపాయాలు తదితర విభాగాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఆసుపత్రిలో పరిశుభ్రత, పారిశుధ్యం, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణను మరింత పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. రోగులు ఆసుపత్రికి వచ్చినప్పటి నుంచి చికిత్స పొందే వరకు ప్రతి దశలో సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా వార్డులు, బెడ్లు, బెడ్‌షీట్లు, శౌచాలయాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఎప్పటికప్పుడు శానిటేషన్ పనులు నిర్వహించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అలాగే ఆసుపత్రి ప్రాంగణంలో చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని, వ్యర్థాలను రంగుల బిన్‌లలో వేరుచేసి నిబంధనల ప్రకారం సురక్షితంగా తరలించాలని సూచించారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న సేవల నాణ్యత, మందుల లభ్యత, వైద్య పరికరాల వినియోగం, శుద్ది చేసిన తాగునీరు, పారిశుధ్య సిబ్బంది పనితీరు సంతృప్తికరంగా ఉందని కొనియాడారు. కాయకల్ప ప్రమాణాలను పూర్తిస్థాయిలో అమలు చేస్తే ఆసుపత్రి సేవల్లో మెరుగుదలతో పాటు ప్రజలకు విశ్వాసం పెరుగుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ తనిఖీల్లో ఇబ్రహీంపట్నం సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్‌కుమార్‌రాజు, గజ్వేల్ సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ శ్రీధర్, ఆర్ఎంవో డాక్టర్ ప్రణితి, వైద్య సిబ్బంది సువర్ణ, విమల ఎఫ్సిబా, శ్రీనివాసచారి, మోహన్ బండారి, లక్ష్మి, మేహ్‌రాజ్ భాను, రజిత, జగదాంబ, వకులదేవి, నిర్మల, పుష్ప, హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్, కృష్ణవేణి, లత, కనకలక్ష్మి, భారతమ్మ, సురేందర్, సంతోషి, కనకయ్య పాల్గొన్నారు.

తప్పు చేసిన వాహణదారులకు పూలదండలు వేస్తున్న పోలీసులు

వాహనదారులకు గులాబీ దండలతో అవగాహన

హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త: రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా పోలీసులు శనివారం ఒక వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధించడం పరిపాటికాగా, జీరో ఎన్‌ఫోర్స్‌మెంట్ డే పేరుతో ఎటువంటి ఫైన్లు విధించకుండా ప్రేమతో కౌన్సెలింగ్ నిర్వహిస్తూ వాహనదారుల్లో అవగాహన కల్పించారు. ప్రధాన రహదారులపై ప్రయాణిస్తున్న వాహనదారులను తనిఖీ చేసిన పోలీసులు, నిబంధనలు పాటించని వారికి గులాబీ దండ వేసి, మళ్లీ తప్పు చేయవద్దని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, జరిమానాలు విధించడం మా ఉద్దేశం కాదని, ప్రతీవాహనదారుడు సురక్షితంగా ఇంటికి చేరాలనేదే మా ఆకాంక్ష అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ వెంకటేశ్వర్ రెడ్డి, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో ఉపాధిహామీ పథకం బలోపేతం

-జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి జయదేవ్‌ఆర్య

రాయపోల్, ఏప్రిల్ 18 (ప్రభాతవార్త): ప్రతి గ్రామపంచాయతీలో ఉపాధి హామీ కూలీల సంఖ్యను వంద మందికి పెంచేలా చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి జయదేవ్‌ఆర్య ఆదేశించారు. శనివారం రాయపోల్ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం అమలులో పారదర్శకత, పనుల నాణ్యతాపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారి రవీందర్ పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని, ట్రాక్టర్ల ద్వారా చెత్తను సేకరించి డంపింగ్ షెడ్లకు తరలించాలని ఆదేశించారు. అలాగే మురుగు నీటి కాలువలను పరిశుభ్రంగా ఉంచి, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీనివాస్, ఏపివో జనార్ధన్, ఎంపివో శివకుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ దేవాలయ వార్షికోత్సవానికి ఆహ్వానం

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 18 (ప్రభాతవార్త): మండల కేంద్రంలోని శ్రీరేణుకా ఎల్లమ్మ దేవాలయ దశమ వార్షికోత్సవం ఈనెల 26 నుండి 28 వరకు జరుగనుండగా స్థానిక సర్పంచ్ పనగట్ల శ్రీనివాస్‌గౌడ్ శనివారం జగదేవ్‌పూర్ గ్రామానికి చెందిన ఐఏఎస్ ఇట్టిరెడ్డి వెంకటనరసింహారెడ్డిని హైద్రాబాద్‌లో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా పనగట్ల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఈ యేడు శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయ వార్షికోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ వేడుకలకు తప్పకుండా హాజరుకావాలని వారిని కోరినట్లు తెలిపారు.

గోమాత సంరక్షణ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

రామాయంపేట, ఏప్రిల్ 18, ప్రభాతవార్త: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గోమాత సంరక్షణ వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం స్థానిక ఎస్సై, ఎమ్మార్వోలను కలిసి గోమాతల రక్షణకు సంబంధించి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రాంత సహ సత్సంగ్ ప్రముఖ్ పుట్టి మల్లేశం మాట్లాడుతూ గోవధ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, గోమాతల వధను పూర్తిగా నిరోధించాలని కోరారు. అక్రమ రవాణా ద్వారా గోవులను తరలిస్తున్న ఘటనలను అరికట్టేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఎర్రం ముత్యాలు, ప్రకండ ఉపాధ్యక్షుడు గబ్బుల వెంకటేశం, బల్ల సుధాకర్, బీర నరసింహులు, పట్టణ బజరంగ్ దళ్ సంయోజక్ నాంపల్లి, జిల్లా శారీర ప్రముఖ్ ప్రసాద్, సురేష్, హరి, సాయి, రాజేష్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులను క్షేమంగా ఇళ్లకు చేర్చాలి : ఎస్ఐ

పాపన్నపేట, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : డ్రైవర్లు విద్యార్థులను క్షేమంగా ఇంటికి చేర్చాలని ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. శనివారం పాపన్నపేటలోని శ్రీవిద్య స్కూల్లో ఆయన డ్రైవర్లకు రోడ్డు నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు అతివేగం, నిరక్ష్య డ్రైవింగ్, మద్యం త్రాగి బస్సులు నడుపడం లాంటి చర్యలకు దూరంగా ఉండాలని చెప్పారు. విద్యార్థులను రోడ్డు దాటించాలని సూచించారు. ఓవర్ టేకింగ్ సమయంలో జాగ్రత్తగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో టీచర్లు నిరలాక్షప్ప, రవిందర్, సుమన్, డ్రైవర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో హెల్మెట్లు అందజేసిన కాంగ్రెస్ నేత

చిలిపిచెడ్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : మండల పరిధిలోని గౌతాపూర్‌లో కాంగ్రెస్ నేత శ్రీనివాస్‌రెడ్డి సొంత ఖర్చులతో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎస్సై నర్సింలు పాల్గొని గ్రామస్తులకు హెల్మెట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు యాసీన్ కృష్ణగౌడ్, కృష్ణ, యాదగిరి, జావిద్, శేఖర్, శ్యామ్, జిన్నాభాయ్ తదితరులు పాల్గొన్నారు.

అవాస్తవ ఆరోపణలు సరికాదు : తహసీల్దార్

హత్నూర, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : బోర్పట్ల గ్రామంలో ప్రభుత్వం భూమి ఆక్రమణ జరుగుతున్న పట్టించుకోవడం లేదని ఆరోపణల్లో వాస్తవం లేదని హత్నూర తహసిల్దార్ ఫర్వీన్ షేక్ ఖండించారు. హత్నూర తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తహసిల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం టిజిఐఐసి ద్వారా కేటాయించి భూమిలోనే అరబిందో పరిశ్రమ తెరానీయం పరిశ్రమ ప్రహరి కూడా నిర్మాణం చేపట్టడం జరిగిందని తాసిల్దార్ పర్వీన్ షేక్ అన్నారు. బోరుపట్ల గ్రామ శివారులోని 379 సర్వే నెంబర్లు టీజీఐఐసి నుంచి ప్రభుత్వం పరిశ్రమ కోసం భూమిని కేటాయించిందని తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం హత్నూరకు సంబంధించి ప్రభుత్వ భూమిని ప్రతిపాదనలు మాత్రమే చేశారని భూమిని ఎక్కడా అధికారికంగా కేటాయించలేదని తాసిల్దార్ పేర్కొన్నారు. కొందరు నాయకులు వాస్తవాలు తెలుసుకోకుండా అవాస్తవాలు మాట్లాడడం సరికాదన్నారు. ప్రస్తుతం రెండెకరాల భూమి ప్రభుత్వ ఆధీనంలోనే ఉన్నట్లు తాసిల్దార్ పేర్కొన్నారు.కంసానికుంట, నేరేటికుంట ల శిఖం సర్వేను నీటిపారుదల శాఖ రెవెన్యూ శాఖల సమన్వయంలో ఈనెల 23న సర్వే నిర్వహించేందుకు సమయం నిర్ణయించడం జరిగిందని తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆర్ ఐ లు హరిబాబు, రాహుల్ ఉన్నారు.

దండం పెడుతూ హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పిస్తున్న పోలీసులు

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలను రక్షించుకోండి...

ద్విచక్ర హనదారులకు గులాబి పువ్వులు ఇస్తూ పోలీసుల వినూత్న ప్రచారం

నర్సాపూర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : చేతులెత్తి నమస్కరించి చెబుతున్న హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని ఎస్సై 2 జగన్నాథం ద్విచక్ర వాహనదారులను వేడుకున్నారు. శనివారం నర్సాపూర్‌లో రోడ్డు భద్రతల కార్యక్రమంలో భాగంగా పోలీసులు వినూత్న ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రతి ద్విచక్ర వాహనదారులకు గులాబీ పువ్వులు అందించి శాలువాలతో సన్మానించి వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాహనదారులను ఆయన మాట్లాడుతూ ప్రతి ద్విచక్ర వాహనాదారుడు హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని ప్రాణాలను రక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నతరహా పరిశ్రమ స్థాపనకై ఉద్యమ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

నర్సాపూర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : ఎవరైనా చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకుంటే ఉద్యమ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏపీఎం సంగమేశ్వర్ అన్నారు. శనివారం నర్సాపూర్‌లోని మండల సమైఖ్య కార్యాలయంలో ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీఎం సంగమేశ్వర్ మాట్లాడుతూ చిన్నతరహా పరిశ్రమ ఏర్పాటు చేయాలంటే ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌లో నమోదై ఉండాలన్నారు. రిజిస్ట్రేషన్‌కు కావాల్సి నపత్రాలు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు బ్యాంక్ అకౌంట్ నెంబరు, మొబైల్ నెంబరు తప్పకుండా అవసరం అన్నారు. మైక్రో ఎంటర్‌ప్రైజెస్ పరిశ్రమలకు ఏ చిన్న పరిశ్రమకైనా జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా సబ్సిడీ గురించి అవసరం ఉంటుందని అలాగే బ్యాంకు లబ్ధిదారులకు అప్పు ఇవ్వాలంటే ఉద్యమ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సంగమేశ్వర్ వివరించారు. ట్రైనింగ్‌లో సీసీలు నర్సింలు నాగరాజు దేవిసింగ్ రవీందర్ ప్రవీణ అకౌంటెంట్ మల్లేశం, గ్రామ సంఘాల వివోఏలు, అన్ని గ్రామ సంఘాల అధ్యక్షురాళ్ళు పాల్గొన్నారు.

ముగిసిన వార్డు సభ్యుల శిక్షణ తరగతులు

నర్సాపూర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : వార్డుల అభివృద్ధికి వార్డు సభ్యులు కృషి చేయాలని ఎంపీడీవో మహమ్మద్ మోజమ్ హుస్సేన్ అన్నారు. శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన 3వ విడత వార్డుసభ్యుల శిక్షణలో నర్సాపూర్ మండల పరిధిలోని 12 గ్రామ పంచాయతీలకు చెందిన నూతనంగా ఎన్నికైన సభ్యులకు ఐదు రోజులపాటు శిక్షణ నిచ్చారు. ఈనేపథ్యంలో ఎంపీడీవో మహమ్మద్ మోజమ్ హుస్సేన్ మాట్లాడుతూ శిక్షణలో తెలుసుకున్న పలు అంశాలను సభ్యులు దృష్టిలో ఉంచుకొని వార్డు అభివృద్ధికి పాటు పడాలని ఆయన సూచించారు. అనంతరం వార్డు సభ్యులకు ఎంపీడీవో మహమ్మద్ మోజమ్ హుస్సేన్ సర్టిఫికెట్లు అందజేశారు.

రోడ్డు భద్రతపై అవగాహన

వెల్దుర్తి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : మండల కేంద్రంలో శనివారం ఎస్సై రాజు ప్రయాణికులు. ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారు నరుపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. వాహనాలకు. సంబంధించిన పేపర్లు దగ్గర పెట్టుకోవాలన్నారు. మద్యం తాగి వాహనం నడపరాదని తెలిపారు. తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది. ఆటో డ్రైవర్లు ప్రజలు పాల్గొన్నారు.

ప్రమాదాలు చేయని డ్రైవర్లకు సత్కారం

హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : ప్రజాపాలన ప్రణాళికలో భాగంగా శనివారం హుస్నాబాద్ డిపోలో డిపో మేనేజరు వెంకన్న ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిపో పరిధిలో ఎలాంటి ప్రమాదాలు చేయకుండా సేవలందిస్తున్న డ్రైవర్లను శాలువాలతో సత్కరించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతీ ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ప్రతీ డ్రైవర్ జాగ్రత్తగా వాహనాలు నడిపి ప్రమాదాలు జరగకుండా చూడాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో డిపో సూపర్వైజర్లు, సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బీరయ్యయాదవ్ కుమారుడి మృతిపట్ల ఎమ్మెల్యే సంతాపం

సదాశివపేట, ఏప్రిల్ 18 (ప్రభాతవార్త) : ఉద్యమకారుడు బీరయ్యయాదవ్ పెద్ద కుమారుడు అరవింద్ యాదవ్ మృతి చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఈ వార్త తెలిసిన సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ బొబ్బిలిగామా గ్రామానికి చేరుకుని బీరయ్యయాదవ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అరవింద్ యాదవ్ మృతదేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ఈ దుఃఖాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలని ధైర్యం చెప్పారు.అరవింద్ యాదవ్ మృతి పట్ల ప్రాంతీయ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

ట్రాఫిక్ భద్రతపై అవగాహన సదస్సు : ఎస్ఐ

కొండాపూర్, ఏప్రిల్ 18 (ప్రభాత వార్త): మండల పరిధిలోని మారేపల్లి గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పోలీసుల ఆధ్వర్యంలో "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ పట్నం సంగీత మరియు గ్రామ పెద్దల సమక్షంలో జరిగింది.ఈ సందర్భంగా ఎస్ఐ సోమేశ్వరి మాట్లాడుతూ రోడ్డు భద్రతకు సంబంధించిన ముఖ్యమైన నియమాలను వివరించారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు.ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, కార్ డ్రైవర్లు సీటుబెల్ట్ ధరించడం, వాహన వేగాన్ని నియంత్రణలో ఉంచడం, మద్యం తాగి వాహనం నడపకూడదని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, యువకులు, వాహనదారులు పాల్గొన్నారు.

22 నుంచి సమ్మె బాటలోకి ఆర్టీసీ

హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :

రాష్ట్ర ఆర్టీసీ కార్మికుల జేఏసీ పిలుపు మేరకు ఈ నెల 22 నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు హుస్నాబాద్ ఆర్టీసీ బస్సు డిపో ఎదుట ఆర్టీసీ కార్మికులు గేట్ ధర్నా చేపట్టారు. తమ 32 డిమాండ్ల పరిష్కారానికి రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు కార్మికులందరం సమ్మెలోకి వెళ్తున్నమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద పెండింగ్ లో ఉన్న రెండు పీఆర్సీ బకాయిలు విడుదల చేయాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి, యూనియన్లను పునరుద్ధరించాలనే ప్రధానమైన డిమాండ్లతో సమ్మెలో పాల్గొంటున్నామన్నారు. తమ శక్తిని ధారబోస్తూ మహాలక్ష్మి పథకాన్ని దిగ్విజయంగా కొనసాగిస్తున్నామని, తామేమి గొంతమ్మ కోరికలు కోరడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 18,ప్రభాతవార్త : పౌష్టికాహారం అందించడం వల్ల పిల్లలు ఆరోగ్యవంతులుగా ఉంటారని...అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డిడబ్ల్యుఓ శారద అన్నారు. మండల పరిధిలోని పొన్నాల సెక్టార్‌లో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పిల్లలు ఆరోగ్యంగా ఉంటే సమాజం బాగుంటుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పిల్లల ఆరోగ్యం పట్ల తల్లులు జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పోషన్ అభియాన్ డిసి వెంకటప్రసాద్, శ్రీనివాస్, సర్పంచ్ వెంకటయ్య, ఉప సర్పంచ్ సృజన సంపత్ యాదవ్, సూపర్‌వైజర్ సునీత, పంచాయతీ కార్యదర్శి నరేష్, ఎఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్లు లావణ్య, సరోజన, విజయ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

బెజ్జంకి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : మండల పరిధిలోని దాచారం గ్రామంలో సన్‌రైజ్ ఆసుపత్రి సహకారంతో సర్పంచ్ భైర మానసరాజేందర్ ఆధ్వర్యంలో శనివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరానికి పేదలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మానస రాజేందర్ మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి పథంలోనే కాదు ఆరోగ్య గ్రామంగా తీర్చిదిద్దడానికి సన్ రైజ్ ఆసుపత్రి సహకారంతో గ్రామ ప్రజలకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శిబిరంలో ఉచితంగా బిపి,షుగర్,ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించారని తెలిపారు. చికిత్సలు నిర్వహించిన తర్వాత అవసరం ఉన్న వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారని తెలిపారు. వైద్య శిబిరంలో డాక్టర్ రమణి, హెల్త్ క్యాంపు బృందం, ఉప సర్పంచ్ దీటి బాలనర్సు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను సాధించిన ఘనత ఎఐటియూసిదే

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : దేశంలోనే మొదటి కార్మిక సంఘం ఏఐటియూసి అని...కార్మికుల ఎన్నో పోరాటాలు చేసి చట్టాలను, హక్కులను సాధించిందని జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టాపురం లక్ష్మణ్ అన్నారు. 141వ మే డేను విజయవంతం చేయాలని కోరుతూ సీపీఐ కార్యాలయంలో కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లా డారు. ఎన్నో పోరాటాలు ప్రాణ త్యాగాలు చేసి కార్మికులకు సాధించిన హక్కులను కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడులుగా తీసుకువచ్చిందన్నారు. నాలుగు లేబర్ కోడులతో కార్మికుల హక్కులు హరించుకుపోయే ప్రమాదం ఉందన్నారు. 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచుతున్నారని కార్మికులు సంఘం పెట్టుకునే హక్కును లేకుండా చేస్తుందన్నారు. నాలుగు లేబర్ కోడులు రద్దు చేసే వరకు కార్మికులందరితో కలిసి పోరాటం చేస్తామన్నారు. 141 మేడే సందర్భంగా గ్రామాల్లో మండలాల కేంద్రాలలో ఏఐటియూసి జెండాలను ఆవిష్కరించాలన్నారు. మే డే సందర్భంగా పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించడం జరగుతుందని కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటియూసి నాయకులు చంద్రం, ఐలయ్య, బాలయ్య, రాజు, శ్రీను, మల్లయ్య, యాదగిరి, సంపత్, ఐలయ్య, మౌలానా, తిరుపతి, అజయ్, దేవేందర్ పాల్గొన్నారు.

చెరువు కట్టపై పిచ్చి మొక్కల తొలగింపు

మర్కుక్, ఏప్రిల్ 18 (ప్రభాతవార్త): పాత చెరువు కట్టపై ఏపుగా పెరిగిన ముళ్లపొదలు, పిచ్చి మొక్కలను సర్పంచ్ రాణిమల్లేశం ఆధ్వర్యంలో శనివారం తొలగించారు. కొన్ని రోజులుగా చెరువు కట్టపై పెరిగిన పొదల కారణంగా దారి కనిపించక కట్టపై వెళ్లే రైతులు, గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. నడిచేందుకు వీలులేకుండా ముళ్లపొదలు ఏపుగా పెరగడంతో వాటిని జెసిబి యంత్రంతో తొలగించి శుభ్రం చేశారు. సర్పంచ్, పాలకవర్గ సభ్యులు చొరవ తీసుకొనిపొదలను తొలగించి మార్గాన్ని సుగమం చేశారు. దీంతో రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహేష్, వార్డు సభ్యులు రవి, పాపోళ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీలకు సామూహిక సీమంతాలు

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 18 (ప్రభాతవార్త): మండల పరిధిలోని ఇటిక్యాల గ్రామంలో గల రెండవ అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలకు శనివారం స్థానిక సర్పంచ్ నర్సోళ్ల ధీన రాజలింగం ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్ లో గర్భిణీలకు పౌష్టికాహారం అందిస్తున్నారని, వాటిని అంగన్వాడీ కేంద్రాల లోనే భుజించాలని, సకాలంలో చికిత్సలు చేయించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నరేష్, సిడిపివో సరిత, సూపర్వైజర్ సునీత, మాజీ జెడ్‌పిటిసి లక్ష్మారెడ్డి, ఆయుర్వేద డాక్టర్ దీపాంజలి, పిహెచ్‌సి వైద్యాధికారి సత్యప్రకాష్, గ్రామపంచాయతీ కార్యదర్శి రేఖ, అంగన్వాడీ టీచర్లు ఎం.కవిత, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

దశదినకర్మలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

కొల్చారం, ఏప్రిల్ 18 (ప్రభాతవార్త): మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నేత ముత్యం ప్రవీణ్‌కుమార్ ఇటీవల మరణించగా, ఆయన స్వగృహంలో నిర్వహించిన దశదినకర్మ కార్యక్రమానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముత్యం ప్రవీణ్ కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన ధైర్యం చెప్పారు. పార్టీకి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గౌరీశంకర్‌గుప్త, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు యాబన్నగారి రవితేజ రెడ్డి, కొల్చారం మండల బీఆర్ఎస్ యువత విభాగం అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్‌రావు, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి, సీడీసీ మాజీ చైర్మన్ సూరె నరేందర్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి మేఘమాల సంతోష్‌కుమార్, రంగంపేట సొసైటీ మాజీ వైస్ చైర్మన్ మోత్కు మల్లేశం, పార్టీ నాయకులు రాజా గౌడ్, దుర్గాప్రసాద్ గౌడ్, వెంకటేశం, సోమ నర్సింలు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి

పాపన్నపేట, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : పారదర్శకంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను చేపడుతుందని కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పొడిచన్పల్లి గ్రామంలో కొత్తపల్లి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలలో ప్రభుత్వం ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎర్ర వెంకటయ్య. నాయకులు సంతోష్ రెడ్డి, ఉప సర్పంచ్. వ్యవసాయ, కొత్తపల్లి సొసైటీ అధికారులు రైతులు , గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామ సమైఖ్య సంఘాల సభ్యులకు శిక్షణ

వర్గల్, ఏప్రిల్ 18 (ప్రభాతవార్త): మండలపరిధిలోని గ్రామైక్య సంఘాల అధ్యక్షురాళ్లకు, గ్రామ సమాఖ్య అసిస్టెంట్లకు శనివారం వర్గల్‌లోని సమాఖ్య భవనంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఉద్యమ రిజిస్ట్రేషన్‌పై, మాడల్ క్లస్టర్ లెవల్ ఫెడరేషన్ గురించి, రాబోవు ఐదు సంవత్సరాలకు సంబంధించిన సంఘాల సభ్యుల డ్రీమ్స్ గురించి శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా అడిషనల్ డిఆర్‌డివో సుధీర్, మండల ఏపిఎం కిరణ్‌కుమార్, టివోటీ ఏపిఎం యాదగిరితోపాటు మండలంలోని కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు, అకౌంటెంట్లు, ఆపరేటర్లు, వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలి : సర్పంచ్

హత్నూర ఏప్రిల్ 18, ప్రభాతవార్త : గ్రామాభివృద్ధికి పాటుపడుతున్న తనపై దాడి చేసిన వారిపై శాఖ పరమైన చర్య తీసుకోవాలని హత్నూర మండలం గోవింద్రాజ్ పల్లి సర్పంచ్ బండమీది రాజు కోరారు శనివారం గ్రామంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ఎన్నికల్లో తనపై పోటీ చేసి ఓడిపోయిన శివరాజ్, అతని కొడుకు గ్రామంలో రోడ్డు పనులు చేయిస్తుండగా తనపై దాడి చేసి కొట్టర ని ఆయన ఆరోపించారు ఇలాంటి చర్యలు పు నారావృతం కాకుండా తగిన చర్య తీసుకోవాలని కోరారు. హత్నూర పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

సదాశివపేట, ఏప్రిల్ 18 (ప్రభాతవార్త) : అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా శనివారం సదాశివపేటలోని హెచ్‌పీ గ్యాస్ ఆఫీస్, గోదాంలో అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని ఫైర్ స్టేషన్ ఆఫీసర్ బిక్షపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అగ్ని ప్రమాదాలను ఎదుర్కొనేందుకు (కార్బన్ డయాక్సైడ్) (డ్రై కెమికల్ పౌడర్) ఫైర్ ఎక్స్టింగ్విషర్లు ఉండాలని యాజమాన్యానికి సూచించారు. అగ్ని ప్రమాదాల సమయంలో వెంటనే స్పందించడం ద్వారా పెద్ద ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. అలాగే గ్యాస్ సిబ్బంది, వినియోగదారులకు ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నరసింహారెడ్డి, రవికుమార్, శ్రీశైలం, సాయికుమార్, నవీన్ కుమార్, మారుతి పాల్గొన్నారు.

సుధారాణిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఆంగ్ల అధ్యాపకురాలు సుధారాణికి ఘనంగా వీడ్కోలు

చిలిపిచెడ్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సోమక్కపేటలో ఆంగ్ల అధ్యాపకురాలిగా సేవలందించిన సుధారాణికి ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. మండల విద్యాధికారి, ప్రధానోపాధ్యాయులు విట్టల్ మాట్లాడుతూ సుధారాణి క్రమశిక్షణ, బోధనా పద్ధతులు సంస్థకు ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. అదేవిధంగా సుధారాణి టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన అధ్యాపక పరీక్ష పోటీలో రాష్ట్రస్థాయిలో 13 ర్యాంకు రావడం జరిగిందని చెప్పారు. పాఠశాల యాజమాన్యం, విద్యార్థుల తరపున ఆమెను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. సుధారాణి మాట్లాడుతూ విద్యార్థుల నుండి పొందిన ప్రేమాభిమానాలు వెలకట్టలేనివన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి విట్టల్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు డి.రమేష్, ఉపాధ్యాయులు అజయ్‌కుమార్, యాదవ్ గౌడ్, మోహన్, మహేష్‌కుమార్, విజయ, విష్ణువర్ధన్, రమాదేవి, సంగీత, పూర్వ విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

వాహనదారులకు హెల్మెట్‌లు పంపిణీ

హెల్మెట్లను పంపిణీ చేస్తున్న డిఎస్పీ సత్తయ్యగౌడ్, సర్పంచ్ నారాయణ

మునిపల్లి, ఏప్రిల్ 18 (ప్రభాతవార్త): వాహనదారులకు హెల్మెట్ సురక్షితం అని సంగారెడ్డి డిఎస్పీ సత్తయ్యగౌడ్ అన్నారు. శనివారం మునిపల్లి మండలం బుదేరా చౌరస్తాలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌ను అందజేశారు. అల్లాపూర్ సర్పంచ్ నారాయణ సొంత ఖర్చుతో కొనుగోలు చేసిన హెల్మెట్‌లు యువకులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ సత్తయ్య గౌడ్ మాట్లాడుతూ, రోడ్డు భద్రత నియమాలను పాటించాలని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలన్నారు. అల్లాపూర్ సర్పంచ్ నారాయణ యువకులకు హెల్మెట్‌లు ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. సర్పంచ్ నారాయణ మాట్లాడుతూ యువకులు హెల్మెట్టు ధరిస్తే ప్రమాదాలు నివారించవచ్చున్నారు. ఈకార్యక్రమంలో సీఐ లక్ష్మారెడ్డి, ఎస్సై రాజేష్‌నాయక్, బుదేరా, గోప్లారం, పెద్దలోని, లింగంపల్లి, పోల్కంపల్లి, గార్లపల్లి సర్పంచ్‌లు మల్లేశం, బుద్ద మల్లేష్, రాజు, ఇర్ఫాన్ పటేల్, వీరేశం, ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

బిజెపి ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన

నిరసన తెలుపుతున్న బిజెపి నాయకులు

జోగిపేట, ఏప్రిల్ 18, ప్రభాతవార్త: లోక్‌సభలో మహిళా బిల్లును వ్యతిరేకించినందుకు బిజెపి ఆధ్వర్యంలో జోగిపేటలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని జోగినాథ్ చౌరస్తా వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షురాలు మహేష్కర్ పావని మాట్లాడుతూ మహిళలకూ సమున్నత స్థానం కల్పించాలనే ఉద్దేశంతో ఎన్డీఏ ప్రభుత్వం మహిళా బిల్లును తీసుకొస్తే, ఇండియా కూటమిలోని ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకించాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ కారక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి రుద్రారం మాణయ్య, అసెంబ్లీ కన్వీనర్ ప్రభాత్, అందోలు నియోజకవర్గ కోకన్వీనర్ మహేష్కర్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న బిజెపి నాయకులు

మనోహరాబాద్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : పార్లమెంట్‌లో మహిళా బిల్లును కాంగ్రెస్ పార్టీ అడ్డుకోవడానికి నిరసిస్తూ శనివారం మనోహరాబాద్‌లో కాంగ్రెస్, రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను బిజెపి మండల అధ్యక్షుడు బక్క వెంకటేష్‌గౌడ్ దగ్ధం చేశారు. అనంతరం రాష్ట్ర నాయకులు నత్తి మల్లేష్ ముదిరాజ్ మాట్లాడుతూ భారత ప్రజాస్వామ్యంలో ఇదొక చీకటి రోజు అని, ప్రధాని నరేంద్రమోడీ 33 శాతం రిజర్వేషన్లతో మహిళా నేతృత్వంలో అభివృద్ధికి బాటలు వేస్తుంటే కాంగ్రెస్, ఇండియా కూటమి అడ్డుకోవడం దారుణమన్నారు. రానున్న ఎన్నికల్లో మహిళలందరూ కలిసి కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు కమ్మరి నరేందర్ చారి, బూత్ కమిటీ అధ్యక్షులు చిట్టి రాజు ముదిరాజ్, రితీష్ ముదిరాజ్, కాళ్లకల్ గ్రామ అధ్యక్షులు కొత్తూరు మల్లేష్ ముదిరాజ్, సీనియర్ నాయకులు రచ్చ శ్రీకాంత్, ఎర్ర కృష్ణ, సోషల్ మీడియా కన్వీనర్ మంచి గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు హెల్మెట్‌లు అందజేత

జహీరాబాద్, ఏప్రిల్ 18,ప్రభాతవార్త: అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ఉగ్గెల్లి తండా సర్పంచ్ భీమ్‌రావు రాథోడ్ ప్రజల రక్షణను దృష్టిలో పెట్టుకుని 50 మంది వాహన చోదకులకు ఉచితంగా హెల్మెట్‌లను బహుకరించారు. గ్రామంలో నిర్వహించిన అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించగా జహీరాబాద్ రూరల్ ఎస్ఐ ఎం కాశీనాథ్ హాజరై తండా వాసులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ప్రతి వాహన చోదకుడు విధిగా హెల్మెట్ ధరించి వాహనాన్ని తోలాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి సమత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శర్మ, ఉప సర్పంచ్ కంటిరామ్, వార్డు సభ్యులు, నాయకులు బికు రాథోడ్, దేవిదాస్, గోనె, కిషన్, లాలూ, రవీందర్, కృష్ణ, సాయి కిరణ్, సునీల్, అనిల్, చందు, విజయ్, రాజు, మధు, ప్రభు, రాహుల్, రవి, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌లు అందచేస్తున్న ఎస్ఐ కాశీనాథ్, సర్పంచ్ భీమ్‌రావు రాథోడ్

సంక్షేమ పథకాలు ప్రారంభించిన ఘనత కెసిఆర్‌దే

మాజీ ఎంపి వినోద్ కుమార్

మాట్లాడుతున్న మాజీ ఎంపి వినోద్‌కుమార్

హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త

బిఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం శనివారం మండలంలోని పోతారంలోగల శుభం గార్డెన్ లో మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపి బోయినిపల్లి వినోద్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ నెల 20న నిర్వహించనున్న కేసీఆర్ సభకు నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. సిద్దిపేట నుంచి ఎల్కతుర్తి వరకు జాతీయ రహదారిని తాను ఎంపిగా ఉన్నపుడు పోరాడి తీసుకువచ్చామన్నారు. రాష్ట్రంలో రైతుబంధు, రైతు బీమా వంటి రైతు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌కే చెందుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకివచ్చిన తర్వాత యాదాద్రి లో నిర్మించిన పవర్ ప్రాజెక్ట్‌ను అనవసరంగా నిర్మించారని అవహేళన చేశారని గుర్తు చేశారు. అయితే ఆ ప్రాజెక్ట్ లేకపోతే తెలంగాణలో విద్యుత్ సరఫరా కష్టమయ్యేదని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ రాష్ట్రానికి మేలు చేసిందన్నారు. మెడిగడ్డ బ్యారేజ్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం విమర్శలుచేస్తూ రిపేర్ చేస్తామని చెబుతోందని, కొట్టుకుపోయిందని చెప్పినవారే రిపేర్ చేస్తారో సమాధానం చెప్పాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఎల్లంపల్లి, సుండిల్లా, దేవదుల, సీతమ్మ వంటి అనేక ప్రాజెక్టులను నిర్మించిందని గుర్తు చేశారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో ఎన్నికలు జరిగితేనే గ్రామాలకు నిధులు వస్తాయని, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు త్వరలో జరిగే అవకాశం ఉందని, మే లేదా జూన్ నెలల్లో జిల్లా పరిషత్ ఎన్నికలు వచ్చే అవకాశం ఉందన్నారు. వచ్చే ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని చట్టం చేసినప్పటికీ ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును డిలిమిటేషన్‌తో అనుసంధానం చేయడం వల్లే అమలు ఆలస్యం అవుతోందని తెలిపారు. మహిళలకు రిజర్వేషన్ అమలు చేయడాన్ని జాతీయపార్టీలు వాయిదా వేస్తున్నాయని ఆరోపించారు. అసెంబ్లీ సీట్ల పెంపుపై కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని, కొత్త నియోజకవర్గాల ఏర్పాటుకోసం డిమాండ్ చేయాలని సూచించారు. చివరగా ఈ నెల 20న జరిగే కేసీఆర్ సభను విజయవంతం చేయాలని, హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి భారీగా పార్టీ శ్రేణులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులె పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న బిజెపి నాయకులు

నారీశక్తికి ద్రోహం చేసిన కాంగ్రెస్ భరతం పడతాం

-బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి

రామచంద్రాపురం, ఏప్రిల్ 18, ప్రభాతవార్త: నారీశక్తికి ద్రోహం చేసిన కాంగ్రెస్‌ను వదిలిపెట్టే ప్రసక్తే లేదని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షురాలు చిన్నమైల్ గోదావరి అంజిరెడ్డి హెచ్చరించారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లులకు వ్యతిరేకంగా ఇండికూటమి ఓటువేయడాన్ని నిరసిస్తూ శనివారం రామచంద్రాపురం పట్టణం జాతీయ రహదారిపై బిజెపి నాయకులు,మహిళా మోర్చా ప్రతినిధులతోకలసి గోదావరి అంజిరెడ్డి రోడ్డెక్కి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 33 శాతం రిజర్వేషన్లతో మహిళా నేతృత్వంలో అభివృద్ధికి బాటలు వేస్తుంటే కాంగ్రెస్, ఇండికూటమి కుట్రపూరితంగా బిల్లును అడ్డుకుని మహిళా వ్యతిరేతను వారు బట్టబయలు చేసుకున్నారని విమర్శించారు. ఏప్రిల్ 17 దేశ ప్రజాస్వామ్యానికి చీకటి రోజని వాపోయారు. కార్యక్రమంలో జిన్నారం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, అమీన్‌పూర్ బిజెపి మండలాధ్యక్షులు ఈర్ల రాజు, భారతినగర్ డివిజన్ అధ్యక్షురాలు రాజిని, ఆర్‌సిపురం డివిజన్ ప్రధాన కార్యదర్శి పద్మావతి, బిజెపి ఐటి సెల్ నాయకురాలు మాధురి, నాయకులు మల్లేశం, అనూష, గీత, బసమ్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేటలో బిజెపి నిరసన..రాస్తారోకో..

రాస్తారోకో చేస్తున్న బిజెపి నాయకులు

రామాయంపేట, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : పార్లమెంట్‌లో మహిళా బిల్లును కాంగ్రెస్ పార్టీ అడ్డుకునే ప్రయత్నాలకు నిరసనగా రామాయంపేటలో భారతీయ జనతా పార్టీ నాయకులు శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రాస్తారోకో నిర్వహించి, కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. బిల్లుకు మద్దతుగా తమ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, కాంగ్రెస్ పార్టీ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఈ నిరసనలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు, పట్టణ అధ్యక్షుడు శీలం అవినాష్‌రెడ్డి, కౌన్సిలర్ శంకర్‌గౌడ్, యువ మోర్చా పట్టణ అధ్యక్షుడు పోచమ్మల కన్నయ్య, మాజీ అధ్యక్షుడు దమ్మయ్య గారి భానుచందర్, మాజీ అధ్యక్షుడు దయానందరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి అనిల్, బూత్ అధ్యక్షులు నాగరాజు, సంతోష్, మండల ఉపాధ్యక్షుడు శ్యామలాచారి, యాదగిరి యాదవ్, సీనియర్ నాయకుడు దామోదర్ రావు, పట్టణ ఉపాధ్యక్షుడు మరుకు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పాపన్నపేటలో...

పాపన్నపేట, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకంగా ఓటు వేసినందుకు నిరసనగా పాపన్నపేటలో బిజెపి శ్రేణులు రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా భాజపా నాయకులు రాములు మాట్లాడుతూ భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఏప్రిల్ 17 ఒక చీకటి దినంగా చెప్పవచ్చన్నారు. కాంగ్రెస్, ఇండియా కూటమి మరోసారి మహిళా వ్యతిరేక నైజాన్ని చాటుకుంటూ, ఈ దేశ ఆడబిడ్డల పట్ల క్షమించరాని నమ్మకద్రోహానికి పాల్పడ్డాయని. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చ నాయకులు చంద్రయ్యా, పట్టణ అధ్యక్షులు కిష్టయ్య, భాగేష్, సతీష్, వెంకట్, సాయిబాబా, పెంటయ్య, గోపాల్ తదితరులు ఉన్నారు.

హుస్నాబాద్‌లో...

నిరసన వ్యక్తం చేస్తున్న బిజెపి నాయకులు

హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : హుస్నాబాద్‌లో బీజేపీ ఆధ్వర్యంలో మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా చేపట్టారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ, దాని మిత్రపక్షాలు మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించి పార్లమెంట్‌లో అది ఆమోదం పొందకుండా చేశాయని ఆరోపించారు. దీంతో మహిళలను కించపరిచినట్టే కాకుండా వారి హక్కులను దెబ్బతీశారని విమర్శించారు. నిరసనలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా బిల్లును అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం

బిజెపి నాయకులు

నార్సింగి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :

మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల హక్కులు,రాజకీయాల్లో వారికి సముచిత ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందని, మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు సత్యపాల్ రెడ్డి, బిజెపి జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు ఎన్నం లింగారెడ్డి, పట్టణ అధ్యక్షులు మైలారం నర్సింలు, బీజేపీ సీనియర్ నాయకులు మన్నె యాదగిరి, కిసాన్ మోర్చా మండల ఉపాధ్యక్షుడు పున్న రమేష్, బూతు అధ్యక్షులు మెతుకు శ్రీనివాస్, వడ్ల సాయి, దొంతి స్వామి మైలారం సత్యం, గోధల స్వామి స్వామి రెడ్డి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

సురక్షిత ప్రయాణాలే 'అరైవ్ అలైన్' లక్ష్యం : ఎమ్మెల్సీ

రామచంద్రాపురం, ఏప్రిల్ 18, ప్రభాతవార్త: సురక్షిత ప్రయాణాలే అరైవ్ అలైన్ లక్ష్యమని ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. శనివారం బీహెచ్ఈఎల్‌లోని ఆర్మీ క్యాంప్ కార్యాలయంలో రామచంద్రాపురం పోలీసు, ట్రాఫిక్ పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అరైవ్ అలైన్ అవగాహన కార్యక్రమానికి అంజిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు ఆస్కారాలకు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్సీపురం ఏసీపీ శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఏసీపి ఆదిమూర్తి, సీఐలు విద్యాసాగర్, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

సమాఖ్య భవన నిర్మాణంతో మహిళల్లో ఐక్యత : సుభాష్‌రెడ్డి

మహిళ సమాఖ్య భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సుభాష్‌రెడ్డి

చౌటకూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త: గ్రామాల్లో సమైఖ్య భవనాల నిర్మాణంతో మహిళల్లో మరింత ఐక్యత పెరుగుతుందని ఎంపిపి మాజీ అధ్యక్షుడు భూంరెడ్డి సుభాష్‌రెడ్డి అన్నారు. చౌటకూరులో ఉపాధి హామి పథకంలో రూ. 10 లక్షలతో నిర్మిస్తున్న సమైఖ్య భవన నిర్మాణానికి భూమి పూజ నిర్వహించి 4 లక్షలతో గ్రామంలోని కేంద్ర ప్రాథమిక పాఠశాలలో నిర్మించిన మరుగు దొడ్లను సర్పంచ్ పార్కల రాంరెడ్డితో కలిసి ప్రారంభించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా సహకారంతో ప్రతి గ్రామానికి సమైఖ్య భవనాలు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు కలాలి రామాగౌడ్, గ్రామ అధ్యక్షులు వర్కల రమేష్, ఉప సర్పంచ్ నాగరాణి కృష్ణ, వార్డు సభ్యులు గోరేమియా, చక్రపాణి, జైపాల్‌రెడ్డి, లక్ష్మయ్య, మహిళా సమైఖ్య సభ్యులు పాల్గొన్నారు.

జనగణనను పారదర్శకంగా నిర్వహించాలి : తహసీల్దార్

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : జనగణనను పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ ప్రభుదాస్ పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి గృహాన్ని కవర్ చేస్తూ, వివరాలను సరైన విధంగా నమోదు చేయాలని సూచించారు. శిక్షణలో నేర్చిన మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమం ఆరు రోజులపాటు కొనసాగుతుందని, ప్రతి మూడు రోజులకు ఒక బ్యాచ్‌గా నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఒక్కో బ్యాచ్‌లో 44 మంది చొప్పున ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు పాల్గొంటున్నారన్నారు. శిక్షణలో జనగణన విధానం, 36 కాలములతో ఉన్న ఫార్మ్‌ల నింపడం, డిజిటల్ యాప్ వినియోగం, ఫీల్డ్‌లో ఎదురయ్యే సమస్యలను ఎలా పరిష్కరించాలి వంటి అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శేఖర్, ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, మాస్టర్ ట్రైనర్ అశోక్ రెడ్డి, యెన్యుమరేటర్లు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

ముగిసిన వార్డు సభ్యులకు శిక్షణ

శిక్షణ పొందిన వార్డు సభ్యులతో మండల అధికారులు

న్యాల్‌కల్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త: మండల పరిధిలోని ఆయా గ్రామాల వార్డు సభ్యులకు 5 రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శనివారంతో ముగిసాయి. శిక్షణ అందుకున్న వార్డు సభ్యులకు ఎంపిఓ సౌజన్య దృవపత్రాలు అందచేశారు. శిక్షణలో పొందిన అవగాహనతో గ్రామాలను అభివృద్ధి చేసుకుంటామని వార్డు సభ్యులు పేర్కొన్నారు. వార్డు సభ్యులకు శిక్షకులు వెంకటేష్, విష్ణులు శిక్షణ ఇచ్చారు.

విగ్నేశ్వర ఆలయ నిర్మాణానికి రూ.1.50 లక్షల విరాళం

గుమ్మడిదల, ఏప్రిల్ 18(ప్రభాతవార్త): జిన్నారం పురపాలక సంఘం పరిధిలోని సోలక్‌పల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న విగ్నేశ్వర ఆలయానికి సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి రూ.1,50,000 విరాళం అందజేశారు. శనివారం గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని తన నివాసంలో ఆలయ కమిటీ సభ్యులకు ఆయన ఈ మొత్తాన్ని అందించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, దైవాలయ నిర్మాణం పుణ్యకార్యమని భావించి భక్తి భావంతో విరాళం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ప్రభాకర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శాంతవర్మ రెడ్డి, కృష్ణగౌడ్, దాసరి నరేందర్‌రెడ్డి, కురుమ శేఖర్, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

గోవర్ధన్ రెడ్డి నివాసంలో ఆలయ విమానానికి అందజేస్తున్న విరాళం

రక్తదానంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

రక్తదాన శిబిరం ప్రారంభం

నారాయణఖేడ్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా శనివారం నారాయణఖేడ్ పోలీస్‌స్టేషన్‌లో లయన్స్ క్లబ్ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, రక్తదాన శిబిరాన్ని నిర్వహించడంపై పోలీస్ శాఖను ఎమ్మెల్యే అభినందించారు. రోడ్డు పై వెళ్లేటప్పుడు ఫోన్ మాట్లాడడం కానీ మద్యం తాగి వాహనం నడపరాదని ట్రాఫిక్ నియమాలను పాటించి ప్రతి ఒక్కరు వాహనాలను నడపాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సిఐలు, శ్రీశైలం, రామకృష్ణ, వెంకటేశ్వరరావు, దుర్గారెడ్డి, ఎస్సైలు, పోలీస్ అధికారులు, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, బాణాపురం రాజు, షారుఖ్ ఖాన్, మహేష్ చౌహాన్, సుబుర్ సాబ్ కౌన్సిలర్, మరియు రక్తదానం చేసిన స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో...

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త: ఈ నెల 20న మహాత్మా విశ్వ గురు బసవేశ్వరుడి జయంతిని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని బసవ ఫంక్షన్ హాల్‌లో లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ మల్కాపురం శివకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ బసవేశ్వర జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం లింగాయత్ సమాజ్ రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. రక్తదాన చేసిన దాతలకు సర్టిఫికెట్లు అందచేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో లింగాయత్ సమాజ్ అధ్యక్షులు రాజశేఖర్ శెట్కార్, కార్యదర్శి రేకుల్గి సుభాష్, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు తట్టు నారాయణ, కౌన్సిలర్ ప్రతినిధి విశ్వేశ్వర్, నాయకులు మాణిక్‌ప్రభు, నగేష్, లింగాయత్ సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

వార్డు సభ్యులకు ముగిసిన శిక్షణ తరగతులు

శిక్షణ పొందిన వార్డు సభ్యులతో మండల అధికారులు

సిర్గాపూర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త: మండల పరిధిలోని 14 గ్రామ పంచాయతీలకు చెందిన వార్డు సభ్యులకు 5 రోజుల పాటు నిర్వహించిన మొదటి విడత శిక్షణ తరగతులు శనివారంతో ముగిసాయి. శిక్షణ పొందిన వార్డు సభ్యులు గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వార్డు సభ్యులకు ఎంపిడిఓ సర్టిఫికెట్లు అందచేశారు. మండలంలోని మరో 14 గ్రామ పంచాయతీల వార్డు సభ్యులకు రెండో విడత శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ముగింపు కార్యక్రమంలో ఎంపిఓ బ్రహ్మయ్య, శిక్షకులు వినయ్, జనార్ధన్‌రెడ్డి, విజయ్‌కుమార్, అనిల్‌కుమార్, రాజు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ...

సిర్గాపూర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త: మండల పంచాయతీ కార్యదర్శుల జిల్లా ఫోరం సంగారెడ్డికి సంబంధించిన క్యాలెండర్‌ను ఎంపిడిఓ శారదా దేవి, ఎంపిఓ బ్రహ్మయ్యలు శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఫోరం ప్రధాన కార్యదర్శి రాజు, ఈసి సభ్యులు జనార్దన్‌రెడ్డి, మండల అధ్యక్షులు అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గౌతం, పంచాయితీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించండి : ఎస్ఐ

జహీరాబాద్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త: ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ రోడ్డ ప్రమాదాలకు దూరంగా ఉండాల్సిన అవసరం ప్రతి వాహన చోదకుడిపై ఉందని పట్టణ ఎస్ఐ వినయ్‌కుమార్ అన్నారు. శనివారం అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా 6వరోజైన శనివారం సంగమిత్ర హైస్కూల్ బస్సు డ్రైవర్లకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ వినయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల రవాణాలో డ్రైవర్ల బాధ్యత ఎంతో కీలకమని, చిన్న పొరపాటు జరిగినా పెద్ద ప్రమాదం చోటు చేసుకునే అవకాశాలు ఉంటాయని హెచ్చరించారు. డ్రైవింగ్ చేస్తూ సెల్ ఫోన్లో మాట్లాడవద్దని చెప్పారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పాఠశాల యాజమాన్యం, బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో ఇంటర్ ఫస్టియర్ ప్రారంభం

ఝరాసంగం, ఏప్రిల్ 18, ప్రభాతవార్త: మండల కేంద్రంలోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని ఇంటర్మీడిట్ మొదటి సంవత్సరం (సైన్స్ కోర్సు) ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శోభన్‌బాబు తెలిపారు. 40 మంది విద్యార్థులను మొదటి సంవత్సరంలో చేర్చుకోనున్నామన్నారు. కేంద్రీయ విద్యాలయాల్లో 10వ తరగతి పూర్తిచేసుకున్న వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని, మిగతా విద్యార్థులకు మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు. సీబీఎస్ఈ, రాష్ట్ర బోర్డులకు సంబంధించిన 10వ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్‌ల చేరుందుకు అర్హులన్నారు. 10వ తరగతి ఫలితాలు వెలువడనందున అడ్మిట్ కార్డు ఆధారంగా ధరఖాస్తులు చేసుకోవాలన్నారు.

ఇంద్రేశం మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడిగా శివారెడ్డి నామినేషన్ దాఖలు

పటాన్‌చెరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : ఇంద్రేశం మున్సిపాలిటీ కోఆప్షన్ పదవి కోసం బిఆర్ఎస్ పార్టీ నేత శివారెడ్డి శనివారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ మేరకు తన నామినేషన్ పత్రాలను మున్సిపల్ అధికారులకు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆశీర్వాదంతో మున్సిపల్ పాలకవర్గం సహకారంతో కోఆప్షన్ సభ్యుడిగా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. గతంలో ఇంద్రేశం గ్రామపంచాయతీ సభ్యుడిగా, ఉపసర్పంచిగా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా పనిచేసిన అనుభవం తనకు ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ప్రమీల, కౌన్సిలర్లు అంతిరెడ్డి, రమేష్, రమేష్ నాయక్, సీనియర్ నాయకులు దుర్గారెడ్డి, ధీరజ్, శ్రీనివాస్, శివరాజ్, తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ వేస్తున్న దృశ్యం